గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జూన్ 2014

# కథలు




ఇచ్చట సమస్యలు అమ్మబడును... తీర్చబడును!

బోర్డును గేటుకు తగిలించి తృప్తిగా దానివంక ఒకసారి చూసి లోపలికి వెళ్లిపోయాడు పరమానందం. అప్పుడే పక్క మార్వాడీ షాపులోకెళ్లి పాల ప్యాకెట్ కొనుక్కొని తీసుకొస్తున్న ఆయన భార్య సోమిదేవి గేటుకి వేళ్లాడుతున్న బోర్డు చూసి గబగబా అడుగులేస్తూ లోపలికి వచ్చి

"రిటైరయ్యాక మీకేమైనా పిచ్చి పట్టిందా? మనిషంటేనే రకరకాల సమస్యలు. అలాంటిది సమస్యలు కొనుక్కోవడమేంటండీ? హవ్వ... ఎవరైనా వింటే నవ్విపోతారు" అంది కోపం, ఆశ్చర్యం, వెటకారాలను మాటల్లో మిళితం చేసి.

"ఓసి నీ పిచ్చి మొహమా! మనిషికి సమస్యలుండేది నిజమే! అయితే కొన్ని సహజంగా వచ్చేవి, మరికొన్ని కోరి తెచ్చుకునేవి. అంటే, నిజానికి సమస్య వుండదు. కానీ, ఉందనుకొని భ్రమపడి దాని గురించి ఆలోచిస్తూ కృంగి కృశించి పోతూంటాడు. దీన్ని బట్టి నాకేమర్థమైందంటే సమస్య లేకుండా మనిషుండలేదు. ఇంకో విషయం... ఆలోచన లేని మెదడు దెయ్యాల కార్ఖానా! అందుకని, అర్థం పర్థం లేని సమస్యలను సృష్టించుకుని దాని గురించి ఆలోచిస్తూ బాధపడిపోయేకన్నా, వాళ్ల జీవితాలు వికసించేలా ఒక ముఖ్య సమస్యనిచ్చి వాళ్ల మెదడుని ఎంగేజ్ చేస్తే... హాయిగా దాని గురించి ఆలోచిస్తూ పరిష్కారాన్వేషణలో తలమునకలై వుంటారు. నిర్మాణాత్మకంగా ఆలోచిస్తూ ప్రగతి పథంలో ముందుకు సాగుతారు. అలా కాకుండా వాళ్లే సమస్యతో మన ముంగిట్లోకొస్తే, ఆ సమస్యను మనం మన అనుభవం, వేదాలు, పురాణేతిహాసాల సహకారంతో సాల్వ్ చేయవచ్చు. సమస్యలో చిక్కుకున్నవాడికన్నా ఒడ్డునున్నవాడి మనసు ప్రశాంతంగా వుంటుంది, త్వరగా పరిష్కారమూ చిక్కుతుంది. అచ్చు పజిల్స్, గేంస్ లా అన్నమాట! నాకెందుకో ఇది క్లిక్ అవుతుందనిపిస్తోంది... నాకూ కాలక్షేపం... ఆర్థికంగా మనకు కాస్త బలాన్నీ చేకూరుస్తుంది. అర్థమైందా?" అన్నాడు.

సోమిదేవి భర్త తెలివికి పొంగిపోయింది... కాకపోతే, 'ఇది అయ్యేపనేనా?' అనుకుంది. చిన్నప్పట్నుంచి తన మనసులోనూ ఎన్నని అర్థంలేని అనుమానాలు, భయాలు చోటు చేసుకున్నాయో... తర్వాత దూదిపింజెలా ఎలా మాయమయ్యాయో... సినిమా రీలులా తిరగసాగాయి. భర్త చెప్పింది నిజమే! మనిషికి తన మనిషిలా అనుమానాలు, భయాలు తీర్చే వ్యక్తి కావాలి. అదీ సైక్రియాటిస్ట్... కౌన్సెలింగ్ లాంటి ప్రొఫెషనల్ వేలో కాకుండా మన తాతయ్యో, బామ్మో చనువుగా దగ్గరితనంతో చెప్పే రీతిలో వుండాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నుండి దూరమై తన చుట్టూ గిరిగీసుకుని బ్రతుకుతున్న ఇప్పటి బిజీ జీవనయాన మనిషి మనసుకి అది సాంత్వన చేకూర్చాలి! తనక్కూడా అది క్లిక్ అవుతుందనిపిస్తోంది. రెక్కలొచ్చిన పిల్లలు దూరమై బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్న తమకి వచ్చేపోయే నలుగురితో కాలక్షేపమవుతుంది.

"మీరన్నది నిజమేనండీ" అంది ఆనందంగా.

మరుసటి రోజు నుండీ మనిషి సమస్యల లావాదేవీలు మొదలయ్యాయి.

తీరుబడి చిక్కని ఆ వ్యాపకంతో... ఆ దంపతుల మనసులో పిల్లలు ఎక్కడో దూరతీరాల్లో వుంటూ తమని పట్టించుకోవట్లేదనే 'సమస్య ' దూరమైంది.




' ఎంత చిత్రమైన మనుషులు ? సానుభూతి కురిపించడానికి సిద్ధమంటారు. కాని అభినందించాలంటే ఆమడ దూరం పరిగెడతారు.' అనుకోకుండా ఉండలేకపోయింది జాహ్నవి, మధ్యాన్నం సంఘటన స్ఫురణకి రాగానే!

జాహ్నవి పేరుమోసిన కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తోంది. మొదట్నుంచి ఎన్నో ఇబ్బందులు, ఇక్కట్లు ఎదుర్కొంటూ కష్టపడి ఉద్యోగం తెచ్చుకుంది. తెలివైన అమ్మాయి కావడంతో ఎటువంటి సిఫార్సులు లేకపోయినా, అంతమంచి కాలేజీలో స్థానం సంపాదించింది. చేరిన ఒకట్రెండు సంవత్సరాలపాటు జూనియర్ అయిన కారణంగా కొంత వివక్షతని ఎదుర్కొన్నా తన ప్రతిభ, మంచితనం కలివిడితనం వల్ల అందరి అభిమానానికి పాత్రురాలయింది. ఇంట్లో అత్తమామలకి, పిల్లలకి, భర్తకి, అడపాదడపా వచ్చే ఆడపడుచులకి, చుట్టాలకి సేవలు చేసుకొని కాలేజికి రావడం, ఏదైనా మనసు కష్టం కలిగితే సీనియర్ లెక్చరర్స్ తో చెప్పుకోవడం, వారి ఓదార్పు మాటలతో సాంత్వన పొందడం ఇవన్నీ ఆమె దైనందిన జీవితంలో భాగమయ్యాయి.ఎప్పుడైనా ఆమె ఏదైనా చెప్పకపోయినా, మిగిలిన వాళ్ళు దగ్గరకొచ్చి మరీ కనుక్కొనేవారు.

" ఏం జాహ్నవీ ! అలా వున్నావు? ఏం జరిగింది? మీ ఆయన ఏమైనా అన్నారా? " అనో, మీ ఆడపడుచు కొత్త డిమాండ్ ఏమైనా పెట్టిందా ? అనో, పిల్లలు గానీ విసిగించారా ఏంటి ? ఇవన్నీ మామూలేనమ్మా ఇవన్నీ కొన్నాళ్ళకి అవే సర్దుకుంటాయిలే , బాధ పడకు " అంటూ అలా ఆమెని మామూలు మనుషుల్లో పడేసే ప్రయత్నం చేసేవారు. ఒకసారి ప్రిన్సిపాల్ జాహ్నవిని పిలిచి పరీక్షల నిర్వహణకి సంబంధించిన కీలకమైన బాధ్యతలు తీసుకోవాల్సిందిగా చెప్పారు.దీనికి జాహ్నవి ఇంట్లో బాధ్యతలు, కొన్ని ఆరోగ్యకరమైన ఇబ్బందులు వివరించేసరికి ప్రిన్సిపాల్ కి చాలా కోపం వచ్చింది. ఇంక ఆ తర్వాత నుంచి జాహ్నవి మీద గుర్రుగానే ఉండేదాయనకు. ఏరకమైన పర్మిషన్లు గానీ, సడలింపులు గానీ ఉండేవి కావు. ఆమె ఏ పని చేసినా తప్పు పట్టేవారు. దాంతో జాహ్నవి చాలా డిప్రెస్డ్ గా అయిపోయింది. మళ్ళీ సహోద్యోగినులే ధైర్యం చెప్తూ ఆమెని ఓదార్చేవారు. ఇలా కొంత కాలం గడిచింది.

జాహ్నవి అత్త మామలు ఏడాది తేడాతో కాలం చేయడం, పిల్లలు ఎదిగి ప్రొఫెషనల్ కోర్సుల్లో జాయినవడం తో ఆమెకి కాస్త తీరిక దొరికి పూర్తి స్థాయిలో ఉద్యోగానికి అంకితమయ్యింది. స్వతహాగా సృజనాత్మక ధోరణి ఉండడంతో అడపాదడపా పరిశోధనా వ్యాసాలు, కథలు, కవితలు వ్రాస్తూ ఉండేది. అవి చదివిన సహోద్యోగినులు " బాగుందోయ్, ఇంకా బాగా వ్రాయాలి " అని మెచ్చుకుంటూ ప్రోత్సహిస్తూ ఉండేవారు. రచనా వ్యాసంగంలోనూ, పాఠాలు చెప్పడంలోనూ, స్టూడెంట్స్ మంచి రిజల్ట్స్ సాధించడంలోనూ ఇలా ఒకటేమిటి, కాలేజీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లోనూ జాహ్నవే ముందుడేది. దాంతో ఆ సంవత్సరం ఉత్తమ అధ్యాపకురాలిగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు అవార్డు ప్రకటించింది. ఆరోజు ప్రిన్సిపాల్ స్వయంగా ఆమెని అభినందిస్తూ వచ్చిన ఆ టెలిగ్రాం ని జాహ్నవికి చూపించి, శుభాకాంక్షలు తెలియజేస్తూ నోటీస్ బోర్డులో ఉంచారు. జాహ్నవి ఆనందానికి అంతులేదు.

రాత్రంతా ఒకటే కలలు.! రేపు అంతా తనని ప్రశంసలతో, పొగడ్తలతో ముంచెత్తుతారని తెగ సంబరపడిపోయింది. మర్నాడు కొంచెం ముందుగా వెళ్ళింది కాలేజికి. అందరూ ఏం జరగనట్టే ఉన్నారు. మామూలుగా ' హాయ్ ' అనేసి వెళ్ళిపోతున్నారే గానీ, ' కంగ్రాట్స్ ' కూడా చెప్పనే లేదెవరు. ఇద్దరు, ముగ్గురు కొలీగ్స్ మాత్రం " పార్టీ ఎప్పుడిస్తున్నావు " అన్నారు నవ్వుతూ.! కొత్తగా చేరిన లెక్చరర్స్ నలుగురు మనస్ఫూర్తిగా అభినందనలు చెప్పి, " మేడం ! మీరే మా రోల్ మోడల్ " అని అన్నారు. చాలా ఆశ్చర్యం అనిపించింది జాహ్నవికి. స్టూడెంట్స్ మాత్రం తెగ పొంగిపోయారు. ఆ అవార్డు వాళ్ళకే వచ్చినంత సంబరపడిపోయారు. బొకేలు, గ్రీటింగులతో హడావుడి చేసేసారు.

రెండు, మూడు రోజులు స్టాఫ్ రూం లో వాతావరణం స్తబ్దుగానే ఉంది. మామూలుగా మాట్లాడుతున్నరు తప్ప ఎవరూ ఈ ప్రసక్తి తేవడం లేదు. ఒకరోజు మధ్యాన్నం స్టాఫ్ రూంలోకి అడుగు పెడ్తూ తన పేరు వినిపించడంతో గుమ్మం దగ్గరే ఆగిపోయింది జాహ్నవి. సభ్యత కాకపోయినా నిలబడి వాళ్ళ మాటలు వినసాగింది. " అమ్మో! చూసారా ఆ జాహ్నవి ? మన కళ్ళ ముందు ఉద్యోగంలో చేరింది. మనకంటే పై మెట్టు మీదకెలా వెళ్ళిపోయిందో? " అని ఒకామె, ' మరే! అమ్మో జాహ్నవి నిన్న మొన్నటిదాకా అత్తింటి ఆరళ్ళు, పిల్లలతో సమస్యలు చెప్పుకుని వాపోతూ ఉండేది. అలాంటిది ఒక్కసారిగా ఎంత మార్పు? స్టూడెంట్స్ తో రేడియో

ప్రోగ్రాంస్, సెమినార్లు ఇప్పించడం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, ప్రిన్సిపాల్ దగ్గర మంచి మార్కులు కొట్టేసింది మొత్తానికి. దేవాంతకురాలు.' అని మరో ఆమె. ' ఏం తెలియని నంగనాచిలా ఉండేది. ఎంత కాలంగా ఈ పన్లన్నీ చేసుకుందో ' అని ఇంకో ఆమె. ఎంతయినా పెట్టి పుట్టిందండీ ఆవిడ. మొగుడు ఇంట్లో బాగా సాయం చేస్తాడు మరి రాయక ఏం చేస్తుంది? మా ఆయన ఉన్నారు , ఎందుకు, తిండి దండగ?" అంది ఇంకో ఆవిడ. " మరే, ఒక ప్రక్క వ్యాసాలూ, కథలు, కవితలు రాసేస్తూ మరో ప్రక్క తన సబ్జెక్ట్ లో సెంట్ పర్సెంట్ రిజల్ట్స్ సాధించేసింది. ఏమైతేనేం? ఇంతమంది సీనియర్స్ ఉండగా బెస్ట్ టీచర్ అవార్డు కొట్టేసింది. " అంటూ దీర్ఘాలు తీసింది పెద్దావిడ. వింటున్న జాహ్నవికి తల తిరిగినట్టనిపించింది. ' వీళ్ళేనా శ్రేయోభిలాషులు అనుకున్నాను? ప్రతి చిన్న విషయం వీళ్ళతో చెప్పి ఊరట పొందేదాన్ని. వీళ్ళ నిజ స్వరూపం ఇదా? గిర్రున వెనక్కి తిరిగి లీవు పడేసి ఇంటికి వెళ్ళిపోయింది. మధ్యాన్నం అంతా ఒకటే తలనొప్పి ఆలోచనలతో....! ఆప్త మిత్రురాలు ప్రకీర్తిని కలిస్తే కాస్త స్వాంతనగా ఉంటుందన్న ఆశతో తన ఇంటికి బయలుదేరింది.

' ఏంటే ఇలా ఊడిపడ్డావు? " ప్రేమగా జాహ్నవి చేతిని అందుకుంటూ అడిగింది ప్రకీర్తి. " ఏం లేదే చాలారోజులైందిగా నిన్ను చూసి "

అంటూండగానే కన్నీళ్ళు వచ్చేసాయి జాహ్నవికి కంగారు పడింది ప్రకీర్తి. ఇద్దరూ మంచి స్నేహితులు స్కూలు రోజుల్నుంచి. అరమరికలు లేకుండా అన్నీ చెప్పుకుంటారు.ప్రకీర్తి చాలా కష్టపడి పైకి వచ్చిన అమ్మాయి. భార్యాభర్తలిద్దరూ సెల్ఫ్ మేడ్ పర్సన్స్. వారిది ప్రేమ వివాహం. మొదట్లో చాలా ఇబ్బందులు పడినా ఇద్దరూ బ్యాంక్ ఆఫీసర్లుగా సెటిల్ అయ్యారు. " జాహ్నవీ ఏమిటే ? ఏమయిందో నాతో చెప్పు. మురళి ఏమైనా అన్నాడా? " ఆత్రుతగా ఆమె భుజం కుదుపుతూ ప్రశ్నించింది ప్రకీర్తి.

కళ్ళు తుడుచుకుంటూ జరిగిన విషయాలన్నీ చెప్పుకొచ్చింది జాహ్నవి. " ఓహ్ దీనికా నువ్వింత కుమిలిపోతున్నావు.? నీకో విషయం చెప్పనా? నేను చెప్పే విషయం వింటే నీ అనుభవాలు నథింగ్ అనిపిస్తాయి. మీ కొలీగ్స్ చాలా బెటర్ అనుకుంటావు " అంది ప్రకీర్తి నవ్వుతూ. " ఏంటే నువ్వనేది? " విస్మయంగా చూసింది జాహ్నవి. ' అవునే వాళ్ళు నీ కొలీగ్స్, ఏమాత్రం సంబంధం , చుట్టరికం లేనివాళ్ళు. ఉద్యోగమన్నాక పోటీలు, ఈర్ష్యలు సహజం. కానీ రక్త సంబంధీకులు, స్వంత వాళ్ళు అయికూడా మా తోబుట్టువులు, కజిన్స్ మా మీద ఎంత అసూయ పడతారో నీకేం తెల్సు? మాకు పెళ్ళయిన కొత్తలో సరైన ఉద్యోగాలు లేక ఎన్ని అవస్థలు పడ్డామో నీకు గుర్తుందిగా? అప్పుడు మా స్వంత వాళ్ళే ఎంతో జాలి పడుతూ, " ఏ సాయం కావాలన్నా మమ్మల్ని మరచిపోవద్దూ అంటూ సానుభూతి కురిపించేవాళ్ళు. అలాగే అనారోగ్యాలు, ఆర్థిక ఇబ్బందులు ఆపరేషన్లు అంటే తెగ బాధ పడుతూ ఓదార్చడంలో ముందుండేవాళ్ళు. ఇవన్నీ చూసి అబ్బ, మా వాళ్ళకి నా మీద ఎంత ప్రేమ, ఎంత కన్సర్న్ అని మురిసిపోయేదాన్ని. కానీ అయిదేళ్ళుగా వాళ్ళ ధోరణిలో ఎంత మార్పొచ్చిందంటే...వింటే ఆశ్చర్యపోతావు. ఉద్యోగాలు వచ్చాయనగానే ఏమన్నారో తెల్సా? " ఆ..బాగానే సంపాదించుకున్నార్లే? పెద్దవాళ్ళెవరితోనో సిఫార్సులు చేయించుకొని ఉద్యోగాలు వేయించుకొని ఉంటారు. " కష్టపడి బ్యాంక్ టెస్టులకి చదివి, సెలక్టయితే , లేనిపోని తప్పుడు మాటలు మాట్లాడ్డం అంటే ఇదే! " మీకేం? హాయిగా కాలుమీద కాలేసుకుని దర్జాగా ఖర్చు పెట్టుకుంటారు " అంటూ ఎత్తిపొడుపు మాటలు అంటే మాకు జాబ్స్ రాకుండా బీదార్పులు అరుస్తూ, వాళ్ళ సాయం, దయాధర్మాల మీద బతుకుతూ ఉంటే బాగుంటుందన్న మాట.

అలాగే నీకు తెల్సు కదా నేను రేడియో టాక్స్ తో పాటు టీవీ న్యూస్ చదువుతూ ఉంటానని. దానిక్కూడా మా తమ్ముడు " నీకేంటి? రేడియో టీవీ అన్నీ నీవే! మా ఆవిడకి ఇంటి పనితోనే తెమలదు. అయినా నాకిలాంటివి ఇష్టం ఉండదు." ఈర్ష్య ధ్వనిస్తూంటే అన్నాడు. అంటే వాళ్ళ ఉద్దేశం టాలెంట్స్ ఉండడం తప్పు. అలాగే మొన్నామధ్య నేను, రవి బెస్ట్ కపుల్ గా హోటల్ అప్సరాలో సెలక్టయ్యి పదివేలు ప్రైజు తెచ్చుకున్నప్పుడు మా వాళ్ళంతా మూతి విరుపులే. " మీ టైం బాగుందిలే! అన్నిట్లో పార్టిసిపేట్ చేస్తారు. ఎక్కడికి వెళ్ళినా ప్రైజులే ప్రైజులు. మీ పనే హాయి. అయినా మాకంత తీరికా లేదు, ఇంట్రస్టూ లేదు....!"అంటూ కామెంట్లు, పుల్ల విరుపు మాటలు.

మా సాఫల్యాలకి మనస్పూర్తిగా ఆనందించిన వాళ్ళు నీలాంటి ఫ్రెండ్స్ తప్ప ఇంకెవరూ లేరు. కాబట్టి మైడియర్ జానూ! ఈ ప్రపంచంలో చాలామంది మనుషుల మనస్తత్వాలు ఇలాగే సంకుచితంగా ఉంటాయి. అవతలి వాళ్ళు కష్టాల్లో, బాధల్లో ఉంటే వీళ్ళకి చెప్పలేనంత సానుభూతి పొంగుకొస్తుంది.; వాళ్ళ మీద ఎంతయినా జాలి కురిపించడానికి సిద్ధంగా ఉంటారు. ఎదుటి వాళ్ళకి దయ, కరుణ చూపించడానికే తాము పుట్టినట్టు భావిస్తూ, ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్నట్టు ఉంటారు. తద్వారా వాళ్ళ కంటే తాము చాలా బాగున్నామనే భావనతో సంతోషంగా ఉంటారు. కాని ఎప్పుడైతే అవతలి వాళ్ళ కష్టాలు, కడగళ్ళు తీరిపోయి వాళ్ళ ఊహలకి అతీతంగా మంచి స్థాయికి చేరుకుంటారో వీళ్ళ అంచనాలు తల క్రిందులవడంతో అభినందించడానికి మనసు రాక, వాళ్ళ మీద వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ ఉంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే వీళ్ళు అవతలి వాళ్ళ ఎదుగుదల సహించలేరు. అభినందించడానికి, ప్రశంసించడానికి ఆమడ దూరంలో ఉంటారు. అలాంటి వాళ్ళని చూసి జాలి పడాలేగాని ఇలా డీలా పడిపోయి ఆత్మ విశ్వాసాన్ని పోగొట్టుకోకూడదు. నువ్వేమి తప్పు చేయలేదు కదా? ఎందుకు వర్రీ అవుతావు?? పట్టుదలతో, రెట్టించిన ఉత్సాహంతో ఇంకా నీ మేధస్సుకు పదును పెడుతూ బాగా పైకి ఎదగడానికి ప్రయత్నం చెయ్యి. ఉరకలెత్తే జలపాతాన్ని ఎవరు ఆపగలరు? తెలివితేటలతో నీ సృజనాత్మక శక్తిని మరింతగా పెంపొందిచుకుంటూ ఇంకా ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలి. నిన్ను విమర్శించేవాళ్ళకి , చాటుగా వెటకారాలు చేసేవాళ్ళకి నీ విజయ పరంపరలతోనే బుద్ధి చెప్పి కనువిప్పు కలిగించాలి. తెలిసిందా?" అంది ప్రకీర్తి తనలో ఆత్మ విశ్వాసాన్ని తిరిగి మేల్కొలిపి, కర్తవ్యాన్ని తెలియజెప్పిన ప్రకీర్తిలో జాహ్నవికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణుడు కనిపించాడు.


తెలివైనవాడు
Aditya
నారంశెట్టి
ఉమామహేశ్వరరావు
www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com

కపిలపురంలో ఉండే సుక్షేణుడు వ్యాపారి. అతడికి చాలా ఊళ్ళల్లో వ్యాపారాలు ఉన్నాయనీ, పలుకుబడి గల వ్యక్తి అనీ , అతడికి రాజుగారి కొలువులో మిత్రులున్నారనీ అనుకునేవారు. అతడిని కలిసి ప్రయత్నిస్తే ఎంత కష్టమైన పని అయినా తొందరగా పూర్తి చేయిస్తాడని అనుకునేవారు.

ఈ వార్త ఆ నోటా ఈ నోటా పాకి పావనపురంలో ఉండే దీర్ఘతముడు కి తెలిసింది. అతడు చదువుకుని రాజుగారి కొలువులో నౌకరీ చెయ్యాలని కోరిక ఉన్నవాడు. ఇది వినగానే సంబరపడిపోయాడు. ఎలాగైనా సుక్షేణుడుని కలుసుకుని తనకి సాయం చెయ్యమని అడగాలని బయల్దేరాడు.

మార్గమధ్యంలో దట్టమైన అడవిని దాటుకుని కపిలపురం వెళ్ళాడు. దీర్ఘతముడు వెళ్ళిన సమయానికి సుక్షేణుడు రాజధానికి వెళ్ళాడు. తిరిగి రావడానికి వారం రోజులు పడుతుందని చెప్పింది అతడి భార్య. తన భర్త తిరిగి వచ్చేవరకు ప్రక్కనే ఖాళీగా ఉన్న తమ ఇంట్లో ఉండమని చెప్పి వేళకి ఇంత తిండి పెడతామని చెప్పింది.

ఆమెతో దీర్ఘతముడు 'అలాగే ఉంటాను. నేను చాల అవసరంలో ఉన్నాను. నాకు ఎలాగైనా రాజకొలువులో నౌకరీ దొరికేలా చెయ్యమని సుక్షేణుడు రాగానే చెప్పండి. అంతవరకూ తిని కూర్చోకుండా నాకు ఏదైనా పని చెబితే మీకు సాయపడతాను' అన్నాడు.ఆమె అలాగే అని మాట ఇచ్చి కొడుకులకు పరిచయం చేసింది.

సుక్షేణుడి వ్యాపారాలని ప్రస్తుతం అతని కొడుకులు చూస్తున్నారు. వాళ్ళు దీర్ఘతముడిని చూసి తల్లి చెప్పినట్టే తమ వ్యాపారాల్లో అవసరానికి సాయం అందించమన్నారు.

దీర్ఘతముడు ఆ ఊరులో సుక్షేణుడి ఇంట్లో పని చేయడం కపిలపురంలోనే ఉంటున్న కుచేలుడు అనే పండితుడు చూశాడు. దీర్ఘతముడిని తన దగ్గరకు పిలిచి 'నువ్వు కొత్త పనివాడివా' అని అడిగాడు.

దానికి దీర్ఘతముడు 'కాదు. నాకు రాజకొలువులో నౌకరీ కావాలి. సుక్షేణుడి సాయం కోరి వచ్చాను.' అని చెప్పాడు.

దానికి కుచేలుడు 'రాజకొలువులో నౌకరీ కావాలంటే మంత్రిగారినో, ఇంకెవరైనా ఉద్యోగులనో కలవాలి గానీ ఇతడేం సాయం చేయగలడు?' అని అడిగాడు.

దానికి దీర్ఘతముడు “మీది ఈ ఊరు కాదా? ఎంతో దూరాన ఉన్న నాకు తెలిసిన సుక్షేణుడి గొప్పతనం మీకు తెలియదా?’ అని అడిగాడు.

‘అతడు గొప్పవాడైతే కదా తెలియడానికి? అదంతా ఎవరో సృష్టించిన పుకారు. రాజోద్యోగుల పెత్తనం తప్పించుకోడానికి అతడే పుకారు లేవదీసాడేమో. రాజుగారితో పరిచయాలున్నవాళ్ళంటే భటులు జంకుతారు కదా. సుక్షేణుడు కూడా నీలా నాలాగా ఒక సామాన్యుడు. అతడికి ఏ పలుకుబడీ లేదు. అసలు మన రాజ్యంలో ప్రతిభకు తప్ప సిఫార్సులకు నౌకరీ దొరకదని ఎరగవా?’ అని అడిగాడు కుచేలుడు కోపంగా.

‘నాకు పని కావాలన్న ఆశ నన్నిక్కడకి రప్పించింది. సుక్షేణుడిని కలిసి వచ్చిన పని పూర్తి చేసుకుని కానీ ఇక్కడి నుండి కదలను’ అన్నాడు దీర్ఘతముడు.

‘సరే నీ ఇష్టం. బాగుపడే యోగం లేనివాడిని ఎవరమూ కాపాడలేము’ అన్నాడు కుచేలుడు.

అక్కడ వారం రోజులున్నాడు దీర్ఘతముడు. అప్పటికీ రాలేదు సుక్షేణుడు. అతడికి మరొక పని పడి అటునుండటే వెళ్ళాడనీ రావడానికి మాసం పైగా పడుతుందని చెప్పారు సుక్షేణుడి భార్యాపిల్లలు. ఇక చేసేది లేక అక్కడే ఉండడానికి నిశ్చయించుకున్నాడు దీర్ఘతముడు. అక్కడ ఉన్నంత కాలం వ్యాపారంలో చిట్కాలు, మెలుకువలు వారి నడిగి తెలుసుకున్నాడు . మొత్తం మీద రెండు మాసాలు గడిస్తే గానీ తిరిగిరాలేదు సుక్షేణుడు.

అతడు రాగానే దీర్ఘతముడిని చూసి అతడు వచ్చిన పని తెలుసుకున్నాడు. “అయ్యో నీ కెవరో తప్పుడు సమాచారం ఇచ్చారు. నాకు అంత పలుకుబడి లేదు. నేను నీకే సాయమూ చెయ్యలేను” అన్నాడు సుక్షేణుడు.

దాంతో తరువాత రోజునే తన ఊరు బయల్దేరాడు దీర్ఘతముడు. అతడికి ఊరి బయట మర్రిచెట్టు నీడలో సేదతీరుతూ కనిపించాడు కుచేలుడు. దీర్ఘతముడిని పలకరించి “నీ నౌకరీ సంగతి ఏం చేసాడు సుక్షేణుడు” అని అడిగాడు.

తనతో సుక్షేణుడు చెప్పిన మాటలు చెప్పి ‘అతడికి అంత పలుకుబడి లేదని చెప్పడంతో మా ఊరు వెళ్ళిపోతున్నాను” అన్నాడు

దీర్ఘతముడు.

దానికి కుచేలుడు ఫకాలున నవ్వి ‘నువ్వొక వెర్రి బాగులవాడివి. నేనప్పుడే చెప్పాను. నువ్వే వినకుండా వారి దుకాణంలో పని చేస్తూ ఉండిపోయావు” అన్నాడు ఎగతాళిగా.

దానికి దీర్ఘతముడు ‘అయ్యా మీరు చెప్పిన మాటకు విలువ ఇచ్చాను కాబట్టే ఈ రెండు నెలలూ వృథా చేయకుండా వారితో ఉండి వ్యాపారరహస్యాలు తెలుసుకున్నాను. ఇప్పుడు మా ఊరు వెళ్ళిన తర్వాత నేను నేర్చుకున్న వ్యాపారం చేసుకుని బ్రతుకుతాను. ఇక ముందు రాజకొలువులొ నౌకరీతో పనిలేదు నాకు” అన్నాడు.

ఆ మాటలు విని ఆశ్చర్యపోయాడు కుచేలుడు. ”నువ్వు వెర్రిబాగులవాడివి అన్న నేనే తెలివితక్కువ వాడిని. సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని వ్యాపార రహస్యాలు నేర్చుకుని వెళుతున్న నీవే నిజంగా తెలివైనవాడివి. నువ్వు వ్యాపారంలో చక్కగా రాణిస్తావు” అన్నాడు మనస్ఫూర్తిగా .

నీతి: తెలివైనవాడు సమయాన్ని ధనంలా భావించి సద్వినియోగం చేసుకుని బాగుపడితే తెలివితక్కువవాడు సమయాన్ని మంచి నీళ్ళలా ఖర్చుపెట్టి వృధా చేసుకుని చెడిపోతాడు..




ఏమండీ ఒక మాట అడగనా?"   జాజి పూల మాల కడుతూ గోముగా ప్రశ్నిస్తున్న భార్యని   చూస్తూ   "ఏంటో ? చెప్పు" అన్నాడు చంద్ర శేఖర్.. "మన కోడలు మనల్ని తమ దగ్గరకి వచ్చేయమంటోందండి. అబ్బాయి కూడా సరదా పడతాడు మనం వాళ్ళతో ఉంటే". అంది   ఇంటి ముందు తోట లో ఈజీ చైర్ లో కూచుని ఆరెంజ్ జ్యూస్ సేవిస్తున్న భర్తని పరిశీలనగా చూస్తూ. "చూద్దాంలే.. ఈ మధ్యేగా నేను రిటైరయ్యాను. కొన్నాళ్ళు ఎటయినా   తిరిగి వద్దాం.   ఏమంత తొందర? అయినా కిషోర్ ఏమంటాడో? మోనిక రమ్మందా? లేకపోతే నువ్వే ఊహించుకుంటున్నావా?".

"అబ్బ మీరెప్పుడు రెంటమతం.   మీకన్నీ చెత్త అనుమానాలే. కోడలుపిల్ల అడిగింది కాబట్టే మీకు చెప్పాను. లేకపోతే నాకేమైనా సరదానా?   బొంబాయి లో ఉద్యోగాలు మానుకొని ఎప్పుడు పడితే అప్పుడు రావటం ఏమన్నా మాటలా? పిల్ల చూస్తే ఆస్ట్రేలియా లో సెటిల్ అయిందా? దాని కూతుర్ని మనదగ్గర   నాలుగేళ్ళుంచినట్టే ఉంచి , ఆ మధ్య   వచ్చి ఎంచక్కా తీసుకెళ్ళిపోయింది   దాన్ని వదిలి ఉండలేమంటూ. అయినా ఇక్కడ మనం పడే పాటేమిటంట?" విసుక్కుంది సరోజ.

"అబ్బ ఏదో మాటవరసకి అని ఉంటుంది లేవే? చూద్దాం లే! అయినా ఇక్కడ ఏం తక్కువ నీ పాటు కి? ఆధునిక వసతులతో అందమైన డ్యూప్లెక్స్ ఇల్లు,   కారు, మంచి ఫ్రెండ్స్, ఎప్పటికప్పుడు ట్రిప్పులు, రాధాస్వామి భజనలు ..ఇంకా   ఏం కావాలి డియర్ నీకు?" ప్రేమగా అడిగాడు   శేఖర్ .

“అది కాదండీ. విజ్జి చూస్తే దూర దేశం . ఇక వీడి చదువు,ఉద్యోగం, పెళ్లి అన్ని తంతులూ ముగిసేనాటికి మీరూ రిటైర్ అయ్యారు. ఇన్నాళ్లూ మీ ఉద్యోగరీత్యా విడివిడిగా ఉండాల్సి పడింది. అసలు మనం వాడితో కలిసి ఉన్న రోజులు వేళ్ళ మీద లెక్క పెట్టొచ్చు. ఇప్పుడింక ఏం బాదరబందీలున్నాయి కనక? కవల పిల్లలతో చేసుకోలేక వాళ్ళూ అవస్థ పడుతున్నారు. అందుకే చెప్తున్నా కిషోర్ దగ్గరకి వెళ్లిపోదాం. అంతగా అయితే ఈ ఇల్లు, కారు అమ్మేసి అక్కడే కొనుక్కుందాం” అంది ఆర్తిగా సరోజ.

”లేడికి లేచిందే పరుగంటే ఇదే మరి!” నవ్వాడు శేఖర్ .

మర్నాడు అంతా కలిసి బీచ్ కి వెళ్ళి, కాలక్షేపం చేసి వస్తూ దార్లో ఫార్ట్యూన్ ఇన్ లో భోజనాల కి ఆగారు.

“ఏరా కిషోర్! ఇక్కడ పనులన్నీ సెటిల్ చేస్కొని నీదగ్గరకి వచ్చేద్దాం అనుకుంటున్నాం. మనవల ఆలనపాలన తో పాటు మాకూ కాలక్షేపం కూడా! ఏమంటావ్ ?”అంది సరోజ మనవరాలికి ఐస్ క్రీం తినిపిస్తూ. కోడలు కుతూహలంగా చూస్తోంది. శేఖర్ ప్లేట్ వైపే దృష్టి కేంద్రీకరించి తింటున్నాడు. భోజనం పూర్తి కానిచ్చి వెయిటర్ ప్లేట్ లో పెట్టిన బిల్ పరిశీలిస్తూ చాలా మామూలుగా చెప్పేశాడు కిషోర్. “ఎందుకమ్మా బాబూ మా దగ్గరికి? నాకు తెలిసి ఇక్కడ మీకేం ప్రాబ్లెమ్ లేదు.. అంతగా అయితే సెలవలకి పిల్లల్ని తీసుకొని వస్తూ ఉంటాం, అలాగే మీకూ చూడాలనిపిస్తే అప్పుడప్పుడూ ఓ పది రోజులువచ్చి వెళ్ళండి. అంతేగాని పూర్తిగా వచ్చేయడం పెట్టుకోకండి. నాకు…”.

మాట పూర్తి కాకుండానే “ అప్పుడప్పుడూనా? అంటే మేము మీతో ఉండడం ఇష్టం లేదా కన్నా?”ఆశ్చర్యం గా అడిగింది సరోజ.

“ నువ్వలా అనుకుంటే నేనేం చెయ్యలేను.. నాన్నగారూ! నాకనిపించింది చెప్పాను. ఆ పైన మీ ఇష్టం.” అన్నాడు తండ్రి వైపు చూసి ప్లేట్ లో టిప్ ఉంచుతూ. శేఖర్ నవ్వి ఊరుకున్నాడు.

“ నువ్వేం మాట్లాడకింక. మోనిక, పిల్లలు ప్రేమగా రమ్మని పిలిస్తే నువ్వే చెప్పించావనుకుని, అందరి కొడుకుల్లా కాదు మావాడు అని మురిసిపోయాను. కాని నీకు మా మీద ఎంత మమకారం ఉందో ఇప్పుడర్ధమయింది. అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు కాదుగా.” సరోజ చిన్నబుచ్చుకుంది

ఇంటికొచ్చేదాకా అంతా మౌనంగా ఉన్నారు.

రాత్రి పడుకోబోయే ముందు కాసేపు బాల్కని లో కూచుని చంద్రున్ని చూస్తూ, సన్న జాజుల పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ రోజంతా జరిగిన విశేషాల్ని భర్త తో పంచుకోవడం సరోజ కి ఎప్పటినించో అలవాటు. కాని ఇవాళ శేఖర్ తో మాట్లాడాలన్పించ లేదు. తను అందరి కోడళ్ళ లా కాకుండా అత్తమామల్ని బాగా చూస్కోవాలని ఎన్నో సార్లు అనుకుంది. అలాగే తను మంచి అత్తగారిలా కోడల్ని ప్రేమగా ఆదరించాలని, అవసరానికి నిలబడాలని కలలు కంది. మోనిక మంచిది, వినయం విధేయత పుష్కలంగా ఉన్న పిల్ల. ఆ అమ్మాయేమీ డ్రామాలాడ్డం లేదు. ముందొక మాట, మొగుడి దగ్గర ఇంకో మాట మాట్లాడే రకం కాదు. కాని కొడుకెందుకు అలా మాట్లాడాడు? ఒంటరిగా కూచుని కొడుకు మాటల్ని తల్చుకుంటూ గతాన్ని నెమరు వేస్కుకోసాగింది సరోజ.

****　　****　　****　　****

“మామయ్యగారి రిటైర్ మెంట్ ఫంక్షన్ నెలాఖరున. పనిలోపని షష్టి పూర్తి కూడా! మనం దగ్గరుండి గ్రాండ్ గా జరిపించాలి.. అనుకున్నట్టుగా అత్తగారికి బనారస్ పట్టుచీర, రాళ్ళ గాజులు మామయ్యగారికి పట్టు పట్టు పంచే, లాల్చీ , ఉంగరం అన్నీ రెడీ చేశాను. పిల్లల పరీక్షలివాల్టితో అయిపోయాయి. ఎప్పుడు బైలుదే రేది మనం కాకినాడ? అక్కడికెళ్ళాక బోల్డు పన్లు..అందరినీ పిలవడాలు, ఫంక్షన్ ఏర్పాట్లు...?” భర్త ని అడిగింది సరోజ అన్నం వడ్డిస్తూ. శేఖర్ తలెత్తి ఆమె వైపొకసారి చూసి “ ఆల్రెడీ వారం రో జులు సెలవు పెట్టేసి వచ్చా. బట్టలు సర్దేయ్ రేపు సాయంత్రం బస్ కి వెళ్దాం” అన్నాడు పెరుగు కలుపుకుంటూ.

ఆటో దిగి లోపలికి వస్తున్న కొడుకు, కోడలు, మనవల్ని చూసి తెగ సంబర పడిపోయారు పరమేశం దంపతులు. “నాన్న గారూ ఎలా ఉన్నారు? అమ్మా నీ ఆరోగ్యం ఎలా ఉందే ?” ప్రేమగా పలకరించాడు శేఖర్ .

“అత్తయ్యా కులాసానా? మామయ్యగారి ఫంక్షన్ దగ్గరకొచ్చేసింది , ఇంక రేపటినించి పిలుపులు మొదలెట్టాలి. కార్డ్స్ తీసుకొచ్చాం చూపిస్తానుండండి !” అంటూ హడావిడి చేస్తున్న కోడలి చేతిని మెత్తగా స్పృశిస్తూ, ఆప్యాయంగా మనవల్ని దగ్గరకి తీస్కుని “ఏం కంగారు లేదు, అన్నీ అవే అవుతాయి . మీరొచ్చేశారు మాకెంతో సంతోషం. ఇంతకీ ప్రయాణం బాగా జరిగిందా? కాళ్ళు కడుక్కోండి. ఏ వేళ తిన్నారో ఏంటో? భోజనాలు కానిచ్చి తీరిగ్గా మాట్లాడుకుందాం.” అంటూ వంటింట్లోకి దారితీసింది తులసమ్మ గారు.

అనుకున్నదాని కంటే ఎంతో ఘనంగా పరమేశం గారి రిటైర్మెంట్ , షష్టి పూర్తి వేడుకలు శేఖర్, సరోజ చక్కగా జరిపించారు.కూతురు దూరదేశం లో ఉండడంతో రాలేకపోయింది., సరోజ చాలా చకచక్యంగా ఆ లోటు ఎక్కడా కనిపించనివ్వలేదు. తాము తెచ్చిన బట్టలు, వస్తువులు ప్రేమగా అత్తమామలకిచ్చి వాళ్ళ ఆశిస్సులు అందుకున్నారు శేఖర్ దంపతులు. అందరూ సరోజ కోడలు కాదు కూతురు అంటుంటే తులసమ్మ పొంగిపోయింది

“చెప్పండత్తయ్యా! ఇన్నాళ్లూ మామయ్యగారి ఉద్యోగం, సరళ పెళ్లి, కానుపు అంటూ ఏవేవో కారణాలు చెప్తూ పట్టుమని పది రోజులు కూడా ఎప్పుడూ మా దగ్గర ఉండలేదు. ఇప్పుడు అన్ని బాధ్యతలూ తీరాయి. సరళ కెనడా లో వాళ్ళాయనతో సుఖంగా ఉంది. ఇంక మీకు అభ్యంతరం ఏంటి మా దగ్గరకి వచ్చి ఉండడానికి?” ఆత్మీయంగా అడిగింది సరోజ చపాతీలు కాలుస్తూ. సలాడ్ చేస్తున్న తులసమ్మ నవ్వి ఊర్కుంది. జవాబు రాకపోవడంతో వెనక్కి తిరిగి అత్తగారి వైపు చూసింది సరోజ. “మాకేదో అవసరమై మిమ్మల్ని పిలుస్తున్నాం అనుకుంటున్నారా ఏంటి?” అంది అనుమానంగా.

“అయ్యో అలా ఏం కాదమ్మా.”

అత్తయ్యా దేవుడి దయ వల్ల , మీ ఆశీర్వాదం వల్ల మాకేమీ లోటులేదు. మీ అబ్బాయిది మంచి ఉద్యోగం కావడంతో అవసరం లేదన్పించి నాతో చేస్తున్న ఉద్యోగాన్ని మాన్పించారు. విజ్జి ఏడో క్లాసుకి , కిషోర్ మూడో తరగతి కొచ్చారు. కావల్సిన సౌకర్యాలన్నీ అమర్చుకున్నాము. ఇల్లు, కారూ! మా అమ్మానాన్న అన్నయ్య దగ్గరున్నట్టే మీరూ మీ అబ్బాయి దగ్గరకొస్తే మాకు పెద్దదిక్కుగా ఉంటారని, అంతా కల్సిమెలిసి హాయిగా ఉండచ్చని అడుగుతున్నా.” అంది నమ్రతగా.

“ సరే చూద్దాం లే, ముందు పిల్లలకి కి ఫలహారం పెట్టు” అంది మాట మారుస్తూ.

“చూద్దాం అంటే కాదు. మీరు మామయ్యగారు ఇకపై మాతో ఉండాల్సిందే. మీకేమీ ఇబ్బంది కలగకుండా చూస్కుంటా.. నాదీ బాధ్యత” మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్న కోడలిని మురిపెంగా చూస్కుంది తులసమ్మ.

కానీ వాళ్ళని తమతో తీసుకురాలేకపోయింది సరోజ. తర్వాత కొన్నాళ్ళకి మామగారు కాలం చేసినప్పుడు కూడా కొడుకు ఎంత పట్టు బట్టినా ససేమిరా అంది అత్తగారు. తనేమైనా తప్పు చేసిందా అని పదే పదే ప్రశ్నించుకుంది, ప్రశ్నించింది అత్తగారిని. లెంపలేసుకుంది అత్తగారు. సరళ కంటే నువ్వే నాకు ఎక్కువ. అక్కడికొచ్చినా, ఇక్కడికొచ్చినా కూచోపెట్టి సేవలు చేస్తావు. తల్లి లా చూస్కుంటావు. కానీ నాకు ఇక్కడుంటేనే బాగుంటుంది. మరీ కాలు చేయి ఆడకపోతే ఎలాగూ మీ దగ్గరకేగా వచ్చేది.” నవ్వుతూ సాగనంపింది తమని. చేసేదేముంది? అప్పుడప్పుడూ వస్తూ పోతూ ఉండేవాళ్లు తాము. కానీ ఆమె

మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండానే మామగారు పోయిన రెండేళ్లకే తీర్థయాత్రల కెళ్ళి కాశీ లో కన్ను మూసింది.

**** **** **** ****

కానీ శేఖర్ ఆనాడు, ఈనాడూ కూడా ఏమీ పట్టుబట్టకపోవడం ఆమెని విస్మయానికి గురిచేసింది. తేల్చుకుందామని భర్త వైపు తిరిగేసరికి చదువుతున్న సుందరకాండ పుస్తకం మూసి, కళ్ళజోడు పక్కనే ఉన్న డ్రెస్సింగ్ టేబిల్ పై పెడుతున్నాడు.

" నాకు తెలియక అడుగుతున్నాను.. ఒక విషయం చెప్పండి!" అంది సూటిగా. "అప్పుడు మీ అమ్మగారిని,నాన్నగారిని ఎంత బతిమాలినా మన దగ్గరకి రావడానికి ఒప్పుకోలేదు, చివరికి మామగారు పోయాక మీరు ప్రాధేయపడినా ఆమె ఒంటరిగా ఉండడానికే సుముఖత చూపించారు గాని మనతో రాలేదు. నిజానికి మనం వాళ్ళ నించి ఏదో ఆశించి పిలవలేదు, ఇది వాళ్ళకీ తెల్సు.

ఇహ ఇప్పుడు కిషోర్ ...మనం వస్తామంటే వద్దంటున్నాడు. ఎందుకని? మనం ఆరోగ్యంగానే ఉన్నాం. డబ్బుకి ఏ లోటూ లేదు. వాళ్ళకి సాయం గా కూడా ఉంటాం దేనికయినా. అన్నిటికంటే ముఖ్యం కోడలికి మనమంటే చాలా అభిమానం, గౌరవం. తల్లిదండ్రులు నీకు సపోర్ట్ గా వస్తాం రా అంటే ఎగిరి గంతేసి ఆహ్వానించడంపోయి మీ బతుకు మీదీ మా దారి మాదీ అంటాడేంటండీ? అయినా మీరేందుకు కల్పించుకొని గట్టిగా అడగరు? అప్పుడు అమ్మ, ఇప్పుడు కొడుకు ..ఒకటే పాట. నా మాటకి విలువ లేదసలెవరికీ!" వాపోయింది సరోజ.

అంతా విని నవ్వేస్తూ "పిచ్చిదానా! పిల్లలు పెద్దయ్యి జీవితం లో స్థిరపడే వరకేనే తల్లిదండ్రుల బాధ్యత... అందుకే అప్పుడు మా అమ్మ రాలేదు. ఇప్పుడు వీడు రావద్దంటున్నాడు. మేం కనీ పెంచి పోషించి చదివించి ఆస్తులు పంచిచ్చి ప్రయోజకుల్ని చేశాం కాబట్టి పిల్లలెప్పుడూ మా మాట జవ దాటకూడదు అనుకుంటారు తల్లిదండ్రులు. అది మీ బాధ్యత. మాకిష్టమైనట్టు ఎంజాయ్ చేసే హక్కు మాకుంది. అంటున్నారు పిల్లలు. తరాల అంతరాలు అర్ధం చేస్కోలేక చాలామంది అభద్రత కి లోనవుతూ అనవసర మైన అనుమానాలతో, అసంతృప్తులతో జీవితాల్ని నరకం చేసుకుంటున్నారు. అందుకే వృద్ధాశ్రమాలూ పెరుగుతున్నాయి.

ఒకటిచెప్పనా? మిధునం సినిమా లో చెప్పినట్టు "డిటాచ్డ్ అటాచ్ మెంట్స్" ఉత్తమం.. అతిథుల్లా వెళ్తొస్తూ ఉంటేనే అనుబంధాలు అద్భుతః . అంతే గాని తగుదునమ్మా అని నెత్తినెక్కించుకున్నా, నెత్తినెక్కాలని చూసినా నెత్తి మీద మొట్టికాయలే మిగిలేది.. సో మై డియర్ సరూ! సెకెండ్ ఇన్నింగ్స్ హాయిగా అనుభవిద్దాం. మంచి ప్రదేశాలు తిరుగుతూ,,

మనకి నచ్చినట్టు జీవిద్దాం." నవ్వాడు శేఖర్. తేలిక పడ్డ మనసుతో శృతి కలుపుతున్న సరోజకి పాలు తోడుపెట్టలేదని గుర్తొచ్చి వంటింట్లోకి వెళ్తూ కోడలి మాటలు విన్పించి, వాళ్ళ గది పక్కన ఆగింది . కిషోర్ ని నిలదీస్తోంది మోనిక.

"ఏంటండీ ఇందాక అలా మాట్లాడారు? నాకేం నచ్చలేదు. పాపం అత్తయ్య ఎంత బాధ పడి ఉంటారో? మనతో ఉంటే తప్పేంటి? నేనే రమ్మనమన్నాను. మనకి పెద్దదిక్కుగా ఉంటారని." అంది మోనిక

"అయ్యో మోనీ! నువ్వు అర్థం చేసుకోలేదా? నాకు అమ్మ నాన్నగారంటే చాలా ఇష్టం. ఇన్నాళ్ళూ కేంపుల ఉద్యోగం తో నాన్న, ఇంట్లో పనులతో అమ్మ ఎంతో అలిసిపోయారు. . విజ్జక్క ని నన్నే కాకుండా సరళత్త కొడుకు సందీప్ ని కూడా ఎంతో జాగ్రత్తగా పెంచి ప్రయోజకుల్ని చేశారు. . చేస్తున్న జాబ్ మానేసి మాకోసం అంకితం అయిపోయింది మా అమ్మ. తర్వాత విజ్జి కూతురు వీణ పుట్టినప్పటి నించి ఆరేళ్లొచ్చేదాకా అమ్మా వాళ్ళే చూస్కున్నారు.. ఎప్పుడూ చాకిరీలే! వాళ్ళ కెవరొచ్చి నిలబడ్డారు? మళ్ళీ ఇప్పుడు మనవల పెంపకం అంటూ ఎందుకు వాళ్ళని ఇబ్బంది పెట్టాలి? అది మన బాధ్యత

అందుకే నాన్న రిటైర్మెంట్ తో వాళ్ళ లైఫ్ లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభం అయ్యాయనుకుంటున్నా.. ఎవరి కయినా ప్రైవసీ అనేది చాలా అవసరం మోనీ . హేపీ గా ఇద్దరినీ పెర్శనల్ స్పేస్ ని ఎంజాయ్ చేయనీ . నాల్రోజులు కలుసుకుని హాయిగా గడిపి, రీచార్జ్ అయ్యి మళ్ళా మన వాళ్ళని ఎప్పుడూ కలుస్తామా అన్న ఉత్సాహం తో వచ్చి వెళ్తూ ఉంటే ఉన్న సంతోషం ఎప్పుడూ కలిసే ఉంటే ఉండనే ఉండదు.

ఇంకో విషయం ..తరాల అంతరాల వల్ల ఎంత పెద్దవాళ్ళమైనా, పిల్లలు పుట్టినా వాళ్ళకి మనం చిన్నపిల్లల్లాగే కనిపిస్తాం, దాంతో ఏదో చెప్తూ ఉంటారు. అది వాళ్ళ తప్పు కాదు. వాళ్ళొక జీవన శైలికి అలవాటు పడినవాళ్లు. మన అలవాట్లు,నిద్రాహారాలు, డ్రెస్సింగ్ ,ఫ్రెండ్స్ అన్నీ వాళ్ళకి కొత్తగా, ఇబ్బందిగా కూడా అన్పించవచ్చు. కానీ అవి మనకు అత్యంత సహజమైన విషయాలు. వాళ్ళ కోసం మనం మార లేం.

అలాగే తమ ఊళ్ళో వాళ్ళకి నచ్చినట్టు వాళ్ళుంటారు. ఇక్కడకొచ్చాక మన మేమైనా కొంచెం మారమని చెప్తే వాళ్ళు నొచ్చుకోవచ్చు . ఎప్పుడైనా నేను గాని, నువ్వు గాని విసుక్కున్నా , లేక మనలో మనం గొడవ పడ్డా వాళ్ళకది బాధ అన్పించవచ్చు.. అందుకే అలా మాట్లాడాను. వాళ్ళు అర్థం చేసుకుంటారని నా నమ్మకం." ఆర్ద్రమైంది కిషోర్ స్వరం.

ఎంత ఆశ్చర్యం? ఏ చదువులూ లేకపోయినా పిల్లలని చక్కగా ప్రయోజకుల్ని చేసి , వారి నించి ఏమీ ఆశించకుండా, భర్త కాలం చేశాక కూడా ఆత్మవిశ్వాసంతో చివరి వరకూ ఎవరి మీదా ఆధారపడకుండా మనుగడ సాగించి ఎంతో

హుందాగా, నొప్పింపక, తానొవ్వక ఒక మంచి జ్ఞాపకంగా మిగిలిపోయిన అత్తగారు, “ఇన్నాళ్లూ మీ పిల్లలికి చేసిన సేవ చాలు, మళ్ళీ ఇప్పుడు మనవలకి సేవలు చెయ్యక్కర్లేదు మీరు హాయిగా రిలాక్సవ్వండి” అంటున్న కొడుకు..

“ బాధ్యతల లంపటాలు పూర్తయ్యాయి. ఇక శేష జీవన మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం..” అంటున్న భర్త . ఇంతకంటే ఏం కావాలి? తృప్తిగా నిట్టూర్చింది సరోజ.“




కాఫీ తాగుతూ దినపత్రిక తిరగేస్తున్నాను... నాలాంటి విశ్రాంత ఉద్యోగులు చేసే పనే అది.

మెయిన్ పేపర్ చదవడం పూర్తయింది. హైద్రాబాద్ ఎడిషన్ తిప్పుతూ శేరిలింగంపల్లి వార్తలు చదువుతుంటే ప్రతీ మంగళవారం మియాపూర్ లో మరిగే సంతలో 'తూనికలు కొలతల అధికారి హల్ చల్ ' అనే వార్త నన్ను ఆకర్షించింది. మళ్లీ మళ్లీ చదివాను.

చదువుతున్న కొద్దీ నా మనసు ఆనంద డోలికల్లో ఉప్పొంగ సాగింది.

సంతలో తూనికలు కొలతల అధికారి తన అనుచరులతో మెరుపు దాడి సలిపి తప్పుడు తూనికలు కల్గిన వారిపై కేసులు నమోదు చేశాడని ఎంతో అభినందిస్తూ వచ్చిన వార్త అది.

నా కొడుకుకు ఆ వార్త చూపించాను. వాడు చదివాడే గానీ, స్పందించలేదు. కోడలు చదివి 'ఇందులో వింత ఏముంది?' అన్నట్లుగా రియాక్షన్ ప్రదర్శించింది. నా భార్య వుంటే నాలాగే ఎంతగానో సంబరపడేది. ఇక మిగిలింది నా ముద్దుల మనవరాలు సుమేధ. దానికి నాలుగేండ్లు. దాన్ని నా ఒళ్లో కూర్చోబెట్టుకుని వార్త చదివి వినిపించసాగాను. నా పిచ్చి గానీ దానికేం అర్థమవుతుంది...? నా మనసులో ఉబలాటమే తప్ప.

"ఏం జలిగింది తాతయ్యా?" అని అడిగింది. గబుక్కున లాక్కున్న పేపర్లో దాని ముద్దు ముఖాన్ని దాచుకుంటూ... నాలోని సంతోషాన్నంతా నా మనవరాలి బుగ్గలపై చూపించాను. నా కళ్లల్లో ఆనందాశ్రువులు...

పేపరు చదువుతున్నప్పుడల్లా సాంబయ్య గుర్తుకు రావడం నాకు మామూలే... కాని, ఈరోజు నన్ను గత స్మృతుల్లోకి లాక్కెళ్లింది.

ఆదివారం...

"పేపార్ కొంటాం... పాత పేపార్ కొంటాం..." అంటూ కేకేసుకుంటూ సైకిలుపై వెళ్తున్న పాత పేపర్లు కొనే అబ్బాయిని నేనూ కేకేసి పిలిచాను.

సైకిలు వెనక్కి త్రిప్పుకొని వచ్చి గేటు ముందు స్టాండ్ వేశాడు.

వాడు తక్కెడ తీయబోతుంటే "కిలో ఎంత?" అని అడిగాను.

"ఆరు రూపాయలు సార్"

"ఏడు గదా..."

"సరే సార్..."

"వామ్మో!... ఈమధ్య పేపర్లు అమ్మక చాలా రోజులవుతోంది. రేట్లు పెరిగాయో ఎమిటో...! తెలియక ఠక్కున ఏడు అనేశాను. ఏనిమిది అంటే బాగుండేది అని నా మనస్సులో ఎనిమిది నృత్యం చేయగానే "ఇదిగో బాబూ... నాకు తెలియక ఏడన్నాను. మా ఆవిడ ఇంట్లో నుండి ఎనిమిది రూపాయలంటూ అరుస్తోంది. ఎనిమిది అయితే తీసుకో... లేదంటే వెళ్లిరా..." అంటూ నిర్మోహమాటంగా అనేసరికి వాడు దానికి "సరే" అన్నాడు.

నాకు ఆశ్చర్యమేసింది. "అదేంటి... నువ్వు మొదలన్న ఆరు రూపాయలకు, ఎనిమిది రూపాయలజ చాలా తేడా వుంది గదా! మరి మొదలే ఆరు అని అనకుండా ఎందుకు మమ్మల్ని మోసం చేస్తావు... నాతో తమాషా చేస్తున్నావా?..." అంటూ కొంచెం కోపం ప్రదర్శించాను.

"మీరు పెద్దవారు... మీతో తమాషాలాడుతూ మాలాంటి అల్ప జీవులం బ్రతగ్గలమా సార్... నిజమే చెప్తున్నా... కాకపోతే, రేటును బట్టి తూకముంటుంది" అని ఠక్కున నాలుక్కర్చుకున్నాడు.

నేను నివ్వెరబోయాను. "మాటలు బాగానే నేర్చావుగానీ... పేపరమ్మేవాళ్లంతా దద్దమ్మలనుకుంటున్నావా...?" అంటూ నాలుగు చివాట్లు పెడదామనుకున్నాను. కానీ, దాతో నాకొరిగేదేముంది? చివాట్లు పెట్టే బదులు వాడిని మచ్చిక చేసుకొని తూకం రహస్యమేంటో కూపీ లాగుదామనే ఉత్సుకత రేగింది.

"సరే... అయితే, నువ్వు మొదలన్న ఆరు కాదు, నేనన్న ఎనిమిది కాదు... ఏడు రూపాయలు చేసుకో..." అంటూ ఇంట్లోని పాత పేపర్నంతా తెచ్చి పేపరబ్బాయి ముందు పడేశాను.

వాడు ఒక్కొక్క కిలో తూకమేస్తూంటే నా ఒళ్లంతా కళ్లు భూతద్దాలై చూడసాగాయి. పదునాలుగు కిలోలైంది. వాడిచ్చిన డబ్బులు జేబులో పెట్టుకుంటూ తక్కెడను తీసుకొని పరీక్షించాను. కోర్టులో న్యాయదేవత చేతిలో వున్నట్టే అంతా సవ్యంగానే వుంది.

"మరి, ఆరయినా, ఎనిమిదయినా యిదే తూకంతో తూస్తావా?" అంటూ కుతూహలంగా అడిగాను.

"ఔను సార్"

"మరైతే ఇప్పుడు కిలో ఎనిమిది రూపాయల చొప్పున పేపర్లను మళ్లీ తూకం వేయి" అన్నాను.

"కుదర్దు సార్... యీముక్క నాకు ముందే చెప్పాల్సింది" అంటూ పేపర్ నంతా గోనె సంచిలో సర్దుకోసాగాడు.

నా అభ్యర్థనను తిరస్కరించినందుకు నాలో అహం పొడుచుకొచ్చింది. రోషంతో "అంతా దొంగలు" అని తిట్టాను.

వాడు తల వంచుకొని "ఇది మా వ్యాపార రహస్యం. మీరు అడగ్గూడదు, నేను చెప్పగూడదు. సారీ సార్..." అంటూ చకచకా అన్నీ సర్దుకొని సైకిలెక్కి వెళ్లిపోయాడు. "పేపార్ కొంటాం..." అంటూ దీర్ఘాలు తీస్తూ...

మధ్యాహ్నం భోంచేసి అలా కాసేపు నడుం వాల్చానో లేదో... కాలింగ్ బెల్ మ్రోగింది. విసుక్కుంటూ వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా ఉదయం పాత పేపర్ కొనుక్కు వెళ్లిన అబ్బాయి. ఆశ్చర్యపోయాను. మనసు మార్చుకొని తన వ్యాపార రహస్యం చెబుదామని వచ్చాడేమోనని కాస్తా చిరునవ్వును పెదవులపై పులుముకొని వ్యంగ్యంగా "ఏం బాబూ, నాకేమైనా డబ్బులెక్కువిచ్చావని అనుమానమొచ్చి వచ్చావా?..." అంటూ అడిగాను.

"లేదు సార్... మీరు పొద్దున అమ్మిన పేపర్లలో యీ సర్టిఫికెట్లున్న కవరొచ్చింది. ఇచ్చిపోదామని వచ్చాను" వాడు చాలా సౌమ్యంగా జవాబిచ్చాడు.

నా గుండె ఝల్లుమంది. ఆతృతగా వాడి చేతిలోని కవరు తీసుకొని చూశాను. మా బాబు రేపు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ కై సర్దుకున్న ఒరిజినల్ సర్టిఫికెట్లు. ఒక్కసారిగా ఉద్వేగంతో "సందీప్" అంటూ అరిచాను.

వాడు ఉన్నపళంగా ప్రత్యక్షమయ్యాడు. "ఏరా... నీ ఒరిజినల్ సర్టిఫికెట్లేవి?" అంటూ గద్దించాను.

వాడు బిక్కమొహంపెట్టి "రాత్రి అన్నీ చెక్ లిస్ట్ ప్రకారం ఒక కవర్లో సర్దుకున్నాను నాన్నా... కానీ, ఉదయం నుండీ ఆ కవర్ కనబడ్డం లేదు. దాని కోసమే వెదుకుతున్నా..." అంటూ భోరున ఏడ్వసాగాడు.

"నీ తెలివి తెల్లారినట్టే వుంది. యింత నిర్లక్షమైతే ఎలారా... ఏడ్చింది చాలు గానీ, తీసుకో... కవర్లో గాదు, అన్నీ ఒక ఫైల్లో సర్దుకో..." అంటూ అప్పటివరకూ నా వెనకాల దాచి వుంచిన కవరు యిచ్చాను.

నేను అమాంతంగా వెళ్ళి పేపర్ అబ్బాయిని హృదయానికత్తుకున్నాను. ఆ హఠాత్పరిణామానికి వాడు "సార్!" అంటూ నిర్ఘాంతపోయాడు.

"మా బాబు జీవితాన్ని కాపాడావు. నేనీ మేలు యీ జన్మలో మరచిపోను... నీ పేరేంటి బాబూ..."

"సాంబయ్య సార్..."

"సాంబయ్యా... యింతకూ ఆ సర్టిఫికెట్లు మావే అని ఎలా గుర్తుపట్టావ్?"

"పొద్దున మీ యింటి ముందున్న నేం ప్లేట్ చూశాను సార్. సర్టిఫికెట్ల మీద సన్ ఆఫ్ దగ్గర అదే పేరు వుంది."

"వెరీ ఇంటిలిజెంట్... ఏంచదువుకున్నావ్? మీ నాన్నగారు ఏంచేస్తుంటారు?"

"మా నాన్న నా చిన్నతనంలోనే కాలం చేశాడు సార్... మా అమ్మ, చెల్లీ, నేనే వుంటాం. అమ్మ ఇంట్లో కుట్టు మిషన్ కుడుతుంది. నేను మా వాడలో అందరికీ ఉదయం పాల పాకెట్లు, పేపర్లు వేస్తాను. చెల్లి పదవ తరగతి చదువుతోంది. కాలేజీలో చదవాలంటే మాలాంటి వాళ్ళకు సాధ్యమా సార్?... డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా బి.కాం. చదువుతున్నాను."

సాంబయ్య నిరంతర పరిశ్రమకు మదిలోనే హాట్సాఫ్ చెప్పాను.

"వెరీగుడ్... అయాం వెరీ వెరీ సారీ సాంబయ్యా... ప్రొద్దున నీ మనసును కష్టపెట్టాను. తూకం సంగతి తెలుసుకుందామనే కుతూహలం కొద్దీ నోరు జారాను. రా... అలా వచ్చి కూర్చో... టీ త్రాగి వెళ్లువు గానీ..." అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాను.

"సారీ సార్... యీరోజే కోచింగ్ సెంటర్లో చేరుదామనుకుంటున్నాను. వెళ్లాలి..." అంటూ రెండు చేతులతో నమస్కరించాడు. డబ్బులిస్తే తీసుకోడని అతని మాటల్లో అభిమానం ప్రస్ఫుటిస్తోంది. అయినా, ఏదైనా సాయం చేయాలి. ఎలా?...

"ఉండు సాంబయ్యా... ఒక్క నిమిషం. నువు ఏ కోచింగ్ సెంటర్లో చేరనవసరం లేదు. నేను కామర్స్ లెక్చరర్ని. నీకు కోచింగ్ నేనిస్తాను. ఇంక నువ్వేమీ ఆలోచించకు. నువ్వు బి,కాం. పాసయ్యేలా నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అంటూ సాంబయ్యను మరో మాట మాట్లాడకుండా అడ్డుకున్నాను.

సాంబయ్య వెంటనే నా రెండు కాళ్లను స్పృశించి కళ్లకద్దుకున్నాడు. ఈ కాలంలో యిలాంటి శిష్యుడు దొరకడం... నా కళ్లల్లో ఆనంద బాష్పాలు దొర్లాయి...

మా సందీప్ యింగనీరింగ్ లో జాయినయ్యాడు.

అదంతా సాంబయ్య చలవే అనుకుంటూ సాంబయ్యకు పక్కా ప్రణాళిక ప్రకారం నా వంతు కృషి చేస్తున్నాను. కానీ, మరో వంక నా మనస్సులో తూకం రహస్యం తెలుసుకోవాలనే ఉబలాటం అలాగే వుండిపోయింది.

అతడి పార్ట్ టైం జాబ్ పాత పేపర్ల వ్యాపారం సాగుతూనే వుంది. అడిగితే, సాంబయ్య కాదనడేమో గానీ, కోచింగ్ యిస్తూ ప్రతిఫలంగా అతడి వ్యాపార రహస్యం అడుగుతున్నాననుకుంటాడని అభిమానం అడ్డొస్తోంది. కానీ, నా మనస్సులో పితలాటకం మానలేదు.

సాంబయ్య బి.కాం. డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. సాంబయ్యకంటే నేనే ఎక్కువగా సంతోషించాను. సర్వీసు కమీషన్

పరీక్షలు రాయమని సలహా ఇచ్చి ప్రోత్సహించసాగాను.

ఓరోజు "సార్... నా తూకం రహస్యం చెప్పమంటారా...?" అని అడిగాడు.

నేను కాస్త బెట్టుగా నాకంతా తెలుసన్నట్టుగా "ఆ ఏముంటుంది... త్రాసులోనో, లేక తూకంలోనో ఏవో గిమ్మిక్కులుంటాయి" అన్నాను.

"కాదు సార్... మీరన్నవి పాత పద్ధతులు. పైగా, అందరికీ తెలిసినివవి... యిప్పుడు కొత్త కొత్త ట్రిక్కులు వాడుతున్నారు."

నేను చెవులు చేటంత చేసుకున్నాను.

"తూనికల్లో రెండు రకాల మోసాలు... కొనుగోలు దగ్గర, అమ్మకం దగ్గర మోసపోయేది వినియోగదారుడే సార్... వినియోగదారుడు ఏ వస్తువులైనా కొందామని మార్కెట్టుకి వెళితే తూకం రాళ్లు చూడ్డానికి ప్రామాణిక రూపంలోనే కనబడినా వాటి అడుగు భాగంలో కొంత మేరకు తొలిచి వుంటాయి. ఇది మొదటి రకం.

ఇక రెండవ రకం... వినియోగదారుడు తన వస్తువులేవైనా అమ్ముదామని అంగడికి వెళితే అక్కడా తప్పుడు తూకం రాళ్లనే వాడతారు.

నా దగ్గర మూడురకాల తూకం రాళ్లున్నాయి సార్... అన్నింటి మీద ఒక కిలో అనే తూనికలు, కొలతల శాఖవాళ్లు నిర్ధారించిన సీలు వుంటుంది. కానీ, వాస్తవానికవి ఒకటి ఒక కిలో... యింకోటి కిలోంబావు. మరొకటి కిలోన్నర వుంటాయి"

'అదెలా సాధ్యమ 'ని అడిగాను.

"ఇదే విషయాన్ని తూకం రాళ్లు అమ్మేవారినడిగాను సార్... మానవుడి మేధాశక్తి పెరిగిన కొద్దీ మంచికి బదులు యిలా మోసాలకు వినియోగిస్తున్నారు. కిలో బాటు అడుగు భాగాన్ని తొలిచి అధిక బరువు కలిగిన ఉక్కు గుండ్లను అమర్చి యథావిధిగా పూడ్చేస్తారట. వీటిని పాత సామానులేవైనా కొనే వ్యాపారులంతా వాడుతున్నారు" అంటూ సాంబయ్య చెప్తూంటే నేను

నివ్వెరబోయాను.

"సార్... యిలా మోసగించడం గూడా నాకిష్టం లేదు. నా మనసు చంపుకొని యీ వ్యాపారం చేస్తున్నాను" సాంబయ్య కళ్లు చెమ్మగిల్లాయి.

"సాంబయ్యా... దీంట్లో నీ తప్పేమీ లేదు. నువు చేస్తున్న మోసం అత్యల్పం. ప్రజలు మార్కెట్ విలువకు పోకుండా అత్యాశకు వెళ్లి బేరసారాలు చేయడం... 'శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు " అన్నట్టు వినియోగదారుడికి అత్యాశ వున్నంతకాలం ఇలాంటి మోసాలు జరుగుతూనే వుంటాయి. అలాంటి ఆశల వలయాలతో ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీల్లో, బ్యాంకుల్లో డబ్బును పోగొట్టుకుంటున్నారు. యిత్తడిని పుత్తడని నమ్మించే దగాకోరుల కోరల్లో బలైపోతున్నారు. 'ఆశ మూరెడైతే మోసం బారెడన్నట్టు ' మనలో అత్యాశ వున్నంత వరకు మోసాలు సజీవంగా మనతోనే కాపురం చేస్తూంటాయి" అంటూ నేను సాంబయ్యను సముదాయిస్తూంటే అతడి కళ్లల్లో భవి విప్లవాత్మక మార్పులకు కృషి చేయాలనే ఆశయ జ్యోతులు వెలగడం చూశాను...



రాత్రి ఏడున్నర. పున్నమి చంద్రుని వెన్నెలతో భూదేవి వెలిగిపోతోంది. పరిపూర్ణంగా విచ్చుకున్న సౌగంధిక పుష్పాలు కమ్మని సువాసనల్ని గాలితెరలపై పేర్చి వాతావరణాన్ని ఆహ్లాద భరితం చేస్తున్నాయి.

నా మనసంతా అదోలా వుంది. మా పెళ్ళి సంవత్సరం దాటుతోంది. సంవత్సరకాలం కాపురం కమ్మగానే చేశాము. జస్ట్ నెలక్రితం జరిగిన ఒక సంఘటన టీ కప్పులో తూఫానై మా ఇద్దరి మధ్యా అగాధాన్ని సృష్టించింది.

అప్పుడేం జరిగిందంటే..

అత్తయ్యకి ఒంట్లో బాగోలేదని నిమ్స్ లో చూపించడానికి హైద్రాబాదు కొచ్చి మా ఇంట్లో వున్నారు మామయ్యావాళ్ళు. వాళ్ళతో పాటు మరదలు కోతి గూడా వచ్చింది. అది చిన్నపట్నుండి హైపర్ యాక్టివ్. దాని అల్లరిని తట్టుకోవడం ఎవరివల్లా అయ్యేది కాదు. మా ఇద్దరి మధ్యా సంవత్సరమే తేడా అవడం వల్ల అందరూ మా ఇద్దరినీ మొగుడూ పెళ్ళాం కిందే చూసేవారు. దానికి పాపం నేనంటే చాలా ఇష్టం. నేనూ దాన్ని పెళ్ళి చేసుకోవాలనే అనుకున్నాను. అది రజస్వల అయి సంపూర్ణత్వాన్నందాక..నేను కోడెవయసు కుర్రాడిగా పరిణతి చెందాక మా బంధం తియ్యదనాన్ని సంతరించుకుంది. ఆమెలోని అణువణువూ కొత్తందాలతో నన్ను రెప్ప వెయ్యనిచ్చేది కాదు. తనని కూడా నా రూపం ఇంద్రజాలం చేస్తోందని నాకూ అర్ధమవుతోంది. అప్పుడప్పుడూ ఆమెని పట్టుకోవాలని..గట్టిగా ఆలింగనం చేసుకోవాలని..ఆ ఎఱ్ఱెర్రని చెర్రీ పెదాలపై నా పెదాలని చేర్చి మధువుని జుర్రుకోవాలని మహా కోరిగ్గా వుండేది. రాత్రుళ్ళు నిద్రపట్టేది కాదు..పైగా వయసుకొచ్చినది..వరసైనదీ ఎదురుగుండా బందరు లడ్డూలా తిరుగుతుంటే కాళ్ళు చేతులు కట్టుకోవడం..నిజంగా నరకమే.

సరిగ్గా అప్పుడే నన్ను పెద్ద చదువులకోసం పట్నం పంపించడానికి ప్రణాళికలు వేస్తున్నారు. మనసంతా ఏదో తెలియని బాధ..తనక్కూడా. అప్పుడు ఏం చేయాలో బాధని ఎలా వ్యక్తం చేయాలో తెలియక పెరట్లో దాన్ని చేతుల్లో దొరకబుచ్చుకుని గట్టిగా గుండెలకి అదుముకుంటూ..పెదాలపై గట్టిగా ముద్దు పెట్టేసుకున్నాను. ఆ అనుభూతి వర్ణనాతీతం. ముద్దు శృంగారానికి మొదటిమెట్టని ఎందుకంటారో అర్ధమైంది. ఒళ్ళంతా ప్రవహిస్తున్న మధురమైన తన్మయత్వం. సరిగ్గా అప్పుడే అమ్మతో ఏదో మాట్లాడుతూ..అత్తయ్య మల్లెపందిరి ఆవలగా వున్న బావిదగ్గరకి వచ్చి బొక్కెనేసింది . ఇద్దరం ఈ లోకంలోకొచ్చాం. కానీ తనే ముందుగా నిలువెల్లా కమ్ముకున్న సిగ్గుతో..నానుండి విడిపోయి పారిపోయింది. భౌతికంగా తనెళ్ళిపోయింది కాని మనసులో రతీదేవిలా స్థిరంగా నిలిచిపోయింది.

నేను హైద్రాబాదు వచ్చాక మా ఊరివాడితో కలిసి ఒకే రూమ్ లో వుంటూ చదువుకోసాగాను. మా ఇంటి ఓనర్ చాలా మంచివాడు. చదువుకునే వాళ్ళంటే చాలా ఇష్టంట. పైగా మేము అమ్మా నాన్నలకి దూరంగా వుంటున్నందున..బెంగ పెట్టుకుంటామని ఆ

దంపతులు చాలా బాగా చూసుకునేవారు. మేము చాలామటుక్కి వాళ్ళింట్లోనే తినే వాళ్ళం. పాపం వాళ్ళ జీవితంలో ఒకే ఒక్కలోటు. వాళ్ళకి ఒక్కగానొక్క కొడుకు అదీ మతిస్థిమితం లేనివాడు. వాడితో పాపం వాళ్ళకి నిత్యనరకం. మాతో వాళ్ళు కలసి వున్నప్పుడు "ఇదిగో ఇది నా మరదలు. మా ఇద్దరికీ ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమ..దానితో దీన్ని వదులుకోలేక పెళ్ళి చేసుకున్నాను. అదిగో వాడు పుట్టాడు. మేము ఏనాడూ సుఖపడింది లేదు. మా జీవితమంతా ఆ పిచ్చిమొక్క సంరక్షణకి అంకితమయిపోయింది. మరొకరికి పుట్టినా వాడి జీవితం బాగుండేదేమో..మాకు పుట్టి అనుభవిస్తున్నాడు. దయచేసి మీరైనా మేనరికాలు చేసుకోవద్దు. మీ ప్రేమకి సంతానాన్ని బలి చేయవద్దు..మీరూ జీవితాన్ని కోల్పోవద్దు"అని కన్నీళ్ళు తుడుచుకునేవాడు.

మా మనసులు చేదుతో నిండినట్టనిపించేది.

నేను తర్వాత మా ప్రొఫెసర్లతో కూడా సందేహ నివృత్తి చేసుకున్నాను. రక్త సంబంధీకులని పెళ్ళి చేసుకుంటే అంగ..మనో వైకల్యాలతో పిల్లలు పుట్టే అవకాశాలు ఎక్కువని చెప్పారు. నేను ఈ విషయాలన్నీ ఉత్తరం రాసి పోస్ట్ చేశాను. ఇంట్లో పెద్ద దుమారమే రేగింది. నేను పండగకెళ్ళినప్పుడు పట్టుకుని అందరూ దులిపేశారు. కాని నేను "అదంటే నాకుమాత్రం ఇష్టం లేదా? రేపు మాకు అవకరంతో పిల్లలు పుడితే మాతో పాటు మీరూ బాధపడాలి. అందుకే దాన్ని పెళ్ళి చేసుకోను"అని గట్టిగా అరిచి చెప్పేశాను.

అది ఆ అశనిపాతాన్ని తట్టుకోలేక కన్నీళ్లతో పరిగెత్తుకెళ్ళిపోయింది.

"బావా నీ పిల్లాడ్ని పెద్ద చదువులు చదివిద్దామనుకున్నావుగా..చూడు ఎంతగా ఎదిగిపోయాడో"వెటకారంగా అని వెళ్ళిపోయాడు మామయ్య.

నాతో ఎవరూ మాట్లాడడం లేదు. రెండురోజులుండి సిటీకొచ్చేశాను. జరిగింది మా ఓనర్తో చెప్పాను.

ఆయన "అయ్యో..ఎంతపనైందయ్యా..మా దౌర్భాగ్యం అందరికీ చుట్టుకోవాలని లేదు కదయ్యా..అనవసరంగా నీ మనసు పాడుచేశాను"అని నొచ్చుకున్నాడు.

"అదేంలేదండీ మీరు చెప్పింది నిజమే..మా ప్రొఫెసర్లతో కూడా మాట్లాడాక ఈ నిర్ణయం తీసుకున్నాను. పిచ్చి మొద్దు మా మరదలికేం తెలియదు. చిన్నప్పటి బంధం కదా..రెండు రోజులు బాధపడి మర్చిపోతుంది. రేపు మరొకరిని పెళ్ళి చేసుకుని పిల్లా

పాపలతో సుఖంగా వుంటుంది."అన్నాను దిగులుగా.

ఆ తర్వాత చదువుపూర్తిచేసుకుని ఉద్యోగం సంపాదించుకున్నాక నా పెళ్ళయింది. పెళ్ళికి మామయ్యవాళ్ళు కూడా వచ్చారు. అదే పిచ్చి మొహంది.. శోకతప్త హృదయంతో తల్లడిల్లిపోతోంది. దాన్ని చూస్తూంటే గుండెని కత్తితో కోసినట్టనిపిస్తోంది. ఏ క్షణమన్నా నా మనసు మారి తనని పెళ్ళి చేసుకుంటానేమోనన్న ఆశ దానిది. అది స్పష్టంగా ద్యోతకమవుతోంది దాని ముఖంలో. దాన్ని చూస్తుంటే నన్ను నేను నిభాయించుకోవడం చాలా కష్టమవుతోంది. త్వరగా ముహూర్త సమయం దగ్గరపడితే బాగుణ్ణనుకున్నాను..అనుకున్న సమయం రానే వచ్చింది. నేను వైష్ణవి మెడలో మూడు ముళ్ళేసేశాను. పెళ్ళయిన పదినిముషాలకే మా మామయ్యా వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇన్నాళ్ళూగా మామయ్యావాళ్ళకీ మాకు మాటలులేవు.అత్తయ్యని ఇక్కడ హాస్పిటల్లో చూపిద్దామని ఇప్పుడే వాళ్ళు మాదాపూర్లోని మా ఫ్లాటుకి రావడం రావడం.

మా మరదలు చిన్నప్పటిలా చలాకీగా..తూనీగలా వుండడం నన్ను ఊపిరితీసుకునేలా చేసింది.

మా ఆవిడ పట్నంలో పెరిగివుండడం వల్ల పని పాట అంతగా రావు. మరదలు పిల్ల ఇల్లంతా సందడిగా గిర గిర తిరుగుతూ పనులన్నీ చేసేస్తోంది. అటు నాకిష్టమైన వంటలు కూడా చేసి భోజనాల దగ్గర కొసరి కొసరి వడ్డిస్తోంది.

"ఏవయ్యా..నన్ను కాదని తనని పెళ్ళి చేసుకున్నావు. మరి ఏం చూసి చేసుకున్నావో..ఒక్క పనీ చేయదు..మొగుడ్ని ఎలా చూసుకోవాలో తెలియదు..తను పెట్టి పుట్టింది బావా" అంది ఒకనాడు.

మా ఆవిడలో కొత్తపెళ్ళికూతురి అందం పోయి భద్రకాళి రూపం కనిపించింది.

మరో రోజు "చూడమ్మోయ్..అసలు బావానేను మొగుడూపెళ్ళాలం కావలసినవాళ్ళం..మేనరికాలు చేసుకుంటే పిల్లలు చక్కగా పుట్టరని ఏ మహానుభావుడో ఈయనగారికి నూరిపోశాడట దాంతో చిన్నప్పట్నించి పెనవేసుకున్న బంధాన్ని పుటుక్కున తెంపి నిన్ను మనువాడాడు..నిజానికి మా మధ్య హద్దుల గీతలు ఎప్పుడో చెరిగిపోయాయి ఒక్క "ఆ" పని తప్ప అన్నీ జరిగిపోయాయి.ఆఁ"అంది.

బాంబు ఒత్తి వెగించింది. అది పడగ్గదిలో కస కస కాలుతూ ఢామ్మని పేలింది.

మామయ్యావాళ్ళు వెళ్ళేదాక ఓపికపట్టి..వాళ్ళటు వెళ్ళంగానే తనూ వాళ్ళ పుట్టింటికి సోమాజిగూడా వెళ్ళిపోయి విడాకులకోసం ఎదురుచూడమని ఫోన్ చేసి చెప్పి మరో మాటకి అవకాశమివ్వకుండా కట్ చేసేసింది.

నాకేం పాలుపోవడం లేదు. నాలోని మదనుడు శయనేషు రంభకోసం తల్లడిల్లిపోతున్నాడు. ఆమెలోని దేవశిల్పి చెక్కిన అంగాంగాలు గుర్తొస్తుంటే మనసుని ఊర్కోబెట్టడం వల్లకావడంలేదు. పైగా రుచి చూసిన పండాయె..నోట్లో లాలాజలం జీవనదవుతోంది.

నెమ్మదిగా తనకి ఫోన్ చేశాను. కట్ చేసింది.

మళ్ళీ చేశాను. మళ్ళీ కట్ చేసింది.

మళ్ళీ మళ్ళీ చేశాను. పదోసారి లిఫ్ట్ చేసి.."కరిగిపోయే మాటలు నాలుగు చెప్పి నన్ను పడేద్దామనుకుంటున్నారా? నెవ్వర్"అంది.

"నువ్వు లేకుండా నేనుండలేను. తనని నేను పెళ్ళి చేసుకోలేదన్న అక్కసుతో మా మరదలేదో లూజుగా మాట్లాడిందని నాకు దూరం అవడం ఏం న్యాయం చెప్పు?"అన్నాను.

"మీకూ దానికీ ఏ 'రిలేషనూ' లేకపోతే..అది అలా ఎందుకు మాట్లాడుతుంది?" మా ఆవిడ్లోని సత్యభామ క్రోధం వ్యక్తం చేసింది.

"నువ్వు నాకో పది నిముషాలు కేటాయించు. ఇక్కడికొచ్చి నేను చెప్పేది విన్నాక ఇహ నీ ఇష్టం" అన్నాను సత్యభామ కాళ్ళు పట్టుకున్న కృష్ణుడిలా సౌమ్యంగా.

"సరే..రేపు చూద్దాం..కాని ఒక్క పది నిముషాలే గుర్తుంచుకోండి"

"నా మాట వినవే బాబు..నువ్వు ఇప్పుడే ఇక్కడికి మనింటికి రా..పదినిముషాలతర్వాత వెళ్ళి పోదువుగాని"

"సరే..ఓ అరగంటలో అక్కడుంటాను."

"అలాగే.."నాలోని మదనుడు సల్సా డ్యాన్స్ చేయసాగాడు.

వైష్ణవి వచ్చేసింది. చిలకాకుపచ్చరంగు చీరా జాకెట్టులో రంభని తలదన్నేంత అందంగా ఎదురుగా ప్రత్యక్షమైంది.

"ఎలా వున్నావు?"

"ఇదిగో ఇలా..చెప్పండి..ఏం సోది చెబుతారో..పది నిముషాల్లో వెళ్ళిపోతా"

"సరే..పద మన గదిలో కెళదాం..ఇక్కడ బావుండదు"

మా బెడ్రూమ్ లోకొచ్చాం. ఎన్నో సార్లు మేము ఏలిన మదన సామ్రాజ్యమది. ఏ సీ చల్లని గాలి నరాల్ని మెలిపెడుతోంది. అప్పటికే స్ప్రే చేసిన రూమ్ ఫ్రెషనర్ నాసికాపుటాల్లోంచి మనసుని స్పృశించి మధురమైన పులకింతలు రేపుతోంది. తెల్లటి దుప్పటితో మంచం..అప్పటికే నేను తెప్పించి పెట్టిన రక రకాల పూలు మనసుకి ఉత్ప్రేరకాన్ని అందిస్తూ మైమరపిస్తున్నాయి.

"చూడు వైష్ణవి..నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటే తననే చేసుకునేవాడినిగా..నిన్నెందుకు చేసుకుంటాను?. మేము ఒకరినొకరం ఇష్టపడిన మాట నిజమే..పెళ్ళి చేసుకోవలనుకున్నదీ నిజమే! కానీ అంగవైకల్యపు పిల్లలు పుడతారని నేను తనని కాదనుకున్నాను. నీ అందమైన రూపం నా మనసులోని మరదలి రూపుని ఏనాడో తుడిచేసింది. ఇప్పుడు నువ్వే నా ప్రపంచం. అనవసరమైన అపోహలతో నిండు యవ్వనాన్ని అడవి కాచిన వెన్నెల చేసుకోకు. ఈ వయసు మళ్ళీరాదు ఇప్పుడే అనుభవించాలి. రేపు మనం వేరే పెళ్ళిళ్ళు చేసుకున్నా ఈ శరీరాలని ఎటువంటి సంకోచం లేకుండా మరొకరికి అప్పగించగలమా? మధురానుభూతులని పొందగలమా? చెప్పు. నువ్వు కాదంటే నేను ఇలాగే బ్రహ్మచారిగానే వుండిపోతాను."అన్నాను.

"నిజంగానా? నేనంటే మీకంత ఇష్టమయితే తనని ఇంకెప్పుడూ మనింటికి రానీయొద్దు."

"వైష్ణవి..పాపం నా మరదలు నన్నెంతో ఇష్టపడి..నా మూలాన నాకు దూరమైంది. చిన్నపట్నించి నా మీద పెంచుకున్న ప్రేమ ఒక్కసారిగా వదులుకోవడం అంత సులువుకాదు. నేను తనకి దక్కలేదన్న అక్కసుతో పల్లెటూరిమొద్దు అలా ప్రవర్తిస్తోంది. ఆడదానివి తనని అర్థం చేసుకో. తనకి మంచి సంబంధం చూసి మనమే పెళ్ళిచేయాలి. అది నా బాధ్యత కూడా"అన్నాను.

"అవునండీ..చదువుకున్న నేను కూడా తనలాగానే జెలసీ ఫీల్ అయి కౄరంగా ప్రవర్తించాను. ఏమనుకోవద్దు"అంది బాధతో కంఠం వణకుతుండగా.

"ఇప్పుడు..మనసులు బరువు చేసుకోవడం కాదు..శరీరాలని తేలిక చేసుకోవాలి ఇలా బట్టల్ని తొలగ.."అని పమిట తొలగిస్తూ ఆమెని గట్టిగా కౌగిలించుకున్నాను.

"మీరంటే నాకూ ప్రేమే..కాని మీరే ముందు కాళ్ళ బేరానికి రావాలన్న మూర్ఖత్వం నాది..ఇంకో రెండురోజులైతే ఉండలేక నేనే మీ దగ్గరకు వచ్చేసేదాన్ని"అంది గుస గుసగా.

అన్నాళ్ళ విరహం తూఫానై ఇద్దరిలో చెలియలికట్టదాటింది.




వేణుపురంలోని సుబ్బయ్య మిఠాయి దుకాణం రుచికరమైన తినుభండారాలకు ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా సుబ్బయ్య స్వయంగా తయారు చేసే సున్ని ఉండలంటే లొట్టలు వేయని వారు లేరు. అయితే, ఒక పర్యాయం సుబ్బయ్య సున్ని ఉండలు తిన్న వారందరికీ జీర్ణ సమస్యలు వెల్లువెత్తాయి. వాంతులూ, విరోచనాలతో కొందరు ఆసుపత్రి పాలయ్యారు కూడా. ఇబ్బంది పడిన వారిలో కొందరు గ్రామాధికారి విశ్వవర్మకు ఫిర్యాదు చేశారు.

విశ్వవర్మ సుబ్బయ్యను పిలిచి, "నీ వద్ద సున్ని ఉండలు కొని తినడం ద్వారానే వారందరికీ అనారోగ్యం కలిగినట్లు వైద్యులు కూడా ధృవీకరించారు. నీవు దోషిగా నిర్ధారించబడితే నష్టపరిహారాన్ని, చెల్లించవలసి ఉంటుంది. దీనిపై నీ సంజాయిషీ ఏమిటి?" అని

ప్రశ్నించాడు.

" అయ్యా...నేను సున్ని ఉండలు తయారు చేసి అమ్మనే గానీ, అందులోని పదార్థాలు నావి కావు. గంగాధరుడనే రైతు వద్ద మినుములు కొన్నాను. వాటిలో నాసిరకమైనవి కలిసి ఉండొచ్చు. అలాగే, నెయ్యి అమ్మిన తిప్పయ్య, అందులో కల్తీ చేయడానికి అవకాశం ఉంది. బెల్లం విక్రయించిన సుందరుడు దానిని అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేశాడేమో తెలియదు. !

ఇంతమందికి ప్రమేయం ఉన్న ఈ వ్యవహారంలో నన్నొక్కడినే తప్పు పట్టడం సమంజసం కాదని నా భావన. నా అభిప్రాయాన్ని కూడా పరిశీలించండి." వినయంగా చెప్పాడు సుబ్బయ్య.

విశ్వవర్మ కాసేపు ఆలోచించాడు. శిక్ష నుంచి తప్పించుకునేందుకే సుబ్బయ్య ఆ ముగ్గురి ప్రస్తావన తీసుకు వచ్చాడని గ్రహించాడు.

" సుబ్బయ్యా, నీవు చెప్పింది నూటికి నూరు పాళ్ళూ నిజం. సున్నుండల తయారీలో వారి భాగస్వామ్యం ఉందని నేను ఒప్పుకుంటాను. అయితే, వారి వద్ద సరుకులను కొనేటప్పుడు వాటి నాణ్యతను పరిశీలించడం నీ విధి. నీ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఉంటే ఈ గడ్డు పరిస్థితి ఏర్పడేది కాదు. పైగా కల్తీ చేసిందెవరో వెంటనే తెలిసేది. ఎలా చూసినా ఈ మొత్తం వ్యవహారంలో నీ అజాగ్రత్తే కారణంగా తేలుతోంది. దీనికి పరిహారంగా వెయ్యి వరహాలను బాధితులకు చెల్లించు." విశ్వవర్మ ఆజ్ఞాపించాడు.

తన పథకం బెడిసి కొట్టడంతో సుబ్బయ్య కిక్కురుమనకుండా పరిహారాన్ని చెల్లించి బయటపడ్డాడు. ఇక అప్పట్నుంచీ తాను రుచి చూసి నాణ్యతను నిర్ధారించుకున్న తర్వాతే మిఠాయిలను అంగడిలో అమ్మకానికి పెట్టడం ప్రారంభించాడు.




"ఎన్ని సార్లు అడిగినా నా జవాబు ఒక్కటే. ఇవ్వడం కుదరదు". ఖచ్చితంగా చెప్పాడు దీపక్.

"అలా అంటే ఎలాగరా కన్నా! ఎప్పటినించో మనసులో ఉండిపోయిందిరా. మళ్ళీ మళ్ళీ వెళ్లలేను. మహాలక్ష్మి గారు తమతో పాటు తీసుకు వెళ్తానన్నారు. ఎంతో కాదు పధ్నాలుగు వేలు, నీకది పెద్ద మొత్తమే కాదు. ఆమె నన్ను జాగ్రత్తగా చూసుకుంటానన్నారు. కాదనకురా, నా బంగారం కదూ"! బతిమాలసాగింది శాంతమ్మ.

"అదే ఎందుకు అంటున్నా? ఇప్పుడు నువ్వు ఆ తీర్థ యాత్రలు చేయకపోతే ఏం మునిగిపోదు గాని, కామ్ గా ఉండు. అయినా నీ దారిన నువ్వు ఊళ్ళు ఊరేగితే ఇక్కడ ధరణి కి ఎంత ఇబ్బంది పిల్లలతో? ఒక పక్క మా ఉద్యోగాలు, ఇంకో పక్క వాళ్ళ స్కూళ్ళు? మా గురించి ఆలోచించవా?" విసుక్కున్నాడు తల్లిని.

వెంటనే “ముందే ధరణి ని అడిగాను కన్నా! పిల్లలకి, తన కి దసరా శెలవులట. పర్లేదు వెళ్ళండి అని చెప్పింది.” ఓహో! బానే ప్లాన్

చేస్కున్నావే..నీకసలు డబ్బు విలువ బొత్తిగా తెలియడం లేదు. ఇక్కడేమీ చెట్లకి కాయడం లేదు. అయినా ఈ వయసులో కృష్ణా రామా అంటూ కూచోక తగుదునమ్మా అని తీర్థ యాత్రలేమిటి? అక్కడ జరక్కూడనిదేదైనా జరిగితే మళ్ళీ నేనేగా పాట్లు పడాలి. ఏం వద్దు గాని ఇంట్లో ఉండు.."అన్నాడు చిరాగ్గా.

"అలా అంటే ఎలాగరా. నువ్వు పంపిస్తావని ఎంతో నమ్మకంగా అనుకున్నాను. ఇంకెప్పుడూ అడగనురా. కాశీ, ప్రయాగ చూడాలని ఎన్నో ఏళ్ళ నించి కలలు కంటున్నాను. మా తండ్రివి కదూ..." ప్రాధేయపడింది శాంతమ్మ.

" ఒకసారి చెప్తే అర్థం కాదా? నేనంత డబ్బు ఇవ్వలేను.ఇంకేం మాట్లాడకు" కచ్చితంగా చెప్పేశాడు దీపక్. ఆవిడకి .. చాలా కోపం వచ్చింది. " ఏరా! చిన్నప్పుడే మీ నాన్నగారు చనిపోతే ఎన్నో కష్టాలు పడి అడిగినది కాదనకుండా నిన్ను పెద్ద చదువులు చదివించింది ఇందుకా? నా సుఖాలు చూస్కోకుండా నిన్నివాళ పెద్ద ఉద్యోగస్తుణ్ణి చేస్తే ఏమాత్రం విశ్వాసం లేకుండా ప్రవర్తిస్తున్నావు. ఇదేమైనా బాగుందా?" సూటిగా ప్రశ్నించింది .

దీపక్ కూడా ఏమాత్రం తగ్గకుండా " ఏంటమ్మా?చదివించాను చదివించాను అంటున్నావు. నేనేమైనా నిన్ను కష్టాలు పడమన్నానా? పస్తులుండి నన్ను చదివించమన్నానా? అది నీ ఛాయిస్. నేను బాగా చదువుకుని, చక్కగా సంపాదిస్తే చూడాలన్నది నీ స్వార్థం. నన్ను సుఖంగా, సంతోషంగా చూడాలన్నది నీ కోరిక... ఎవరో పరాయి వాడిని పెంచినట్టు మాట్లాడుతున్నావే. అందరిలో గొప్పగా చెప్పుకోవడానికి, నీ ఆత్మ తృప్తి కోసం కొడుకుని చదివించుకున్నావ్. ఏదో ఊరికి ఉపకారం చేసినట్టు బడాయి పోకు..అందరు తల్లిదండ్రులూ తమ పిల్లల్ని చదివించుకుంటారు. నువ్వేమీ ఘనకార్యం చేయలేదు. నీ బాధ్యత నిర్వర్తించావంతే. నేను చేయగలిగింది చేస్తున్నాను. నిన్నేమీ ఇబ్బందులపాలు చేయడం లేదుగా. ఈ రోజుల్లో కొంతమంది కొడుకుల్లాగా నిన్ను వృద్ధాశ్రమం లో పడేసి చేతులు దులుపుకో లేదు. సంతోషించు. ధరణి మంచిది కాబట్టి నిన్ను ఉండనిచ్చింది. ఎక్కువ ఆశించకు." అని కరాఖండి గా చెప్పేసి కంప్యూటర్ చూసుకోసాగాడు.

తల తిరిగినట్టయ్యింది శాంతమ్మకి. భర్త అనారోగ్యం తో చనిపోతే, చదువు లేకపోయినా, చేరదీసి ఆదరించే వాళ్ళెవరూ లేకపోయినా మొండి ధైర్యంతో వంట మనిషిగా, ఆయాగా, స్కూళ్ళల్లో అటెండర్ గా నానా అవతారాలు ఎత్తి ఒక్కపూటే తింటూ కొడుక్కి ఈ కష్టాలు తెలిస్తే ఎక్కడ నొచ్చుకుంటాడో అని వాణ్ని మంచి హాస్టల్లో ఉంచి, అడిగినప్పుడల్లా డబ్బు పంపుతూ వాడు కోరుకున్న చదువులు చదివించిందే గాని తనకంటూ కాస్త సొమ్ము కూడా దాచుకోలేదు. కానీ దానికి ప్రతిఫలం ఏం దక్కింది? ఏదో దయాధర్మంగా ఇంట్లో ఉండనిచ్చామంటున్నాడు. జీతం, భత్యం లేని వంట మనిషి వాళ్ళకెక్కడ దొరుకుతుంది? వాళ్ళ పిల్లలని కంటికి రెప్పలా ఏ పనిమనిషి చూసుకుంటుంది?

కోడలికయినా కాస్త ప్రేమ, అభిమానాలున్నాయి తన మీద. ఎప్పుడూ నోరు జారదు. ఆ అమ్మాయికీ తెలుసు వీడి గుణం. అందుకే

పొద్దున్న చెప్పనే చెప్పింది " యాత్రలకి కావలిసిన డబ్బు నేను ఇస్తానత్తయ్యా..హాయిగా పదిరోజులు తిరిగి రండి ఆయన్నడక్కండి. అని.బుద్ధి తక్కువై అడిగాను. విశ్వాసం లేకుండా ఇంత కటువుగా ఎలా మాట్లాడగల్గుతున్నాడు? కృతఘ్నుడు .. ఛీ !!!! మనసు మండిపోతోంది. ఏమీ మాట్లాడాలనిపించ లేదు,

కానీ మాట్లాడకుండా ఉండలేక " చూడు కన్నా. నువ్వు నా ఇంటి దీపానివని నేను అనుకున్నట్టే , నువ్వు కూడా నీ పిల్లల్ని ఎంతో ప్రేమగా కష్టపడి పెంచుకుంటున్నావు, మంచి స్కూల్లో చదివించమని వాళ్లేమీ అడక్కపోయినా నీ ఇష్ట ప్రకారం చాలా మంచి స్కూల్లో చదివిస్తున్నావు. కానీ కాలం చాలా శక్తివంతమైనది. ఇవాళ నువ్వు అడిగినట్టే రేపు నీ పిల్లలూ నిన్ను ప్రశ్నిస్తారు. గుర్తు పెట్టుకో " అంది బాధగా.

" చూడమ్మా! నేనేదో ఆశించి వాళ్ళని చదివించడం లేదు. పెద్దయ్యాక మీ నాన్న మిమ్మల్ని ఎంతో కష్టపడి చదివించాడు తెలుసా అని వాళ్ల ని దేబిరించను.. వాళ్ళు నాకు నిలబడాలని కూడా నేను కోరుకోవడం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్ళనించి ఏమీ తీసుకోకూడదనే నా భవిష్యత్ కోసం ఇప్పటి నించే ప్లాన్ చేసుకుంటున్నాను. వృద్ధాప్యం లో ఇబ్బంది పడకుండా బ్యాంక్ లో డబ్బు డిపాజిట్ చేసుకుంటున్నాను. నువ్వు కూడా అలా చేసుకుని ఉండాల్సింది కదా..ప్లానింగ్ అనేది చాలా అవసరం.!" అన్నాడు తెలివిగా.

దిగ్భ్రాంతి గా చూసింది కొడుకు వైపు. ఆ చూపులో ఎన్నో బావాలు. నిన్ను తీర్చిదిద్దాలనుకోవడమే నా ప్లానింగ్. దాచుకునేటంత డబ్బే గనక నా దగ్గర ఉంటే కడుపు మాడ్చుకొని ఎందుకన్ని పాట్లు పడ తాను? నా పెట్టుబడి, సేవింగ్స్, భవిష్యత్ అన్నీ నువ్వే అనుకున్నాను రా కన్నా.. . కానీ నువ్వేమో నీ భవిష్యత్ ప్లానింగ్ లో.. తల్లి వర్తమానాన్ని భారంగా ., అనవసరంగా బావిస్తున్నావు.. పిల్లల పట్ల చూపించే ప్రేమ,మమకారాలు బ్యాంక్ లో దాచుకున్న డబ్బు లాగే అవసానదశ లో ఆదుకుంటాయనే పిచ్చి భ్రమతో వేరే ఏ సేవింగ్స్ చేసుకోకుండా , ఫీలింగ్స్ లేని కొడుకులనే నమ్మిన నాలాటి వాళ్ళకి ప్లానింగ్ గురించి ఏం తెలుస్తుంది?! శాంతమ్మ అశాంతిగా నిట్టూర్చి, మౌనం గా వంటింట్లోకి నడిచింది.




"కవితా... ఏమిటి నువ్వంటున్నది?" దాదాపు అరచినట్టుగా అంది కావేరి.

"అవును వదినా..." తలవంచుకుని నేలచూపులు చూసింది కవిత.

ఏడుపుని పెదవి అంచుల్లోనే ఆపేసేందుకు శాయశక్తులా కృషి చేస్తోంది కవిత.

ముద్దు గులాబిలాంటి కవిత వదనం వాడిపోయింది.

ఆమె ఎంత అంతరంగ మధనాన్ని అనుభవించిందో... కళ్ళకింద నల్లని చారికలు తెలియజేస్తున్నాయి.

"మిమ్మల్ని ఇంత షాక్ కి గురిచేసే ఈ విషయాన్ని వెల్లడించడానికి నేనెంత స్ట్రగుల్ అయ్యానో..." గద్గద స్వరంతో పలికింది కవిత.

"వాడిలా మాట్లాడాడంటే..." కావేరి స్వరంలో అపనమ్మకం ఇంకా వైదొలగలేదు.

"ఆయన నోటివెంట ఆ మాటలు విన్నప్పుడు... ఆ క్షణం... నాకు చచ్చిపోవాలనిపించింది..." కవిత భోరుమంది ఒక్కసారిగా...

"కవితా ప్లీజ్!" అనునయంగా ఆమెను హృదయానికి హత్తుకుంది కావేరి.

ఆవేదనంగా చెలియలికట్ట దాటిన సంద్రంలా హృదయపు పొరలని ఛేదించుకుని కన్నీటిరూపంలో బహిర్గతమవుతోంది.

"ఊరుకో కవితా... ధీరజ్ తో నేను మాట్లాడతాగా..." ఓదార్చింది కావేరి.

"సిఫార్సులతో కాపురాలు చక్కబడతాయా వదినా! ఆ వివేకమే వుంటే ఆయనింత నిర్దయగా మాట్లాడి వుండేవారే కాదు..." వెక్కసాగింది కవిత.

"మీరంటే ఆయనకు ఇష్టం, గౌరవం. మీ సాన్నిహిత్యం ఎరిగినదాన్ని కనుక ఎవరికీ చెప్పుకోలేని నా మనోవేదనను మీ ముందుంచాను. మీ వల్ల నా సంసారం చక్కబడితే అంతకన్నా నాకు కావలసిందేమీ లేదు" కన్నీళ్లు తుడుచుకుంది.

"పద భోంచేద్దాం. అసలే వట్టిమనిషివి కూడా కాదు" సోఫాలో నుంచి లేచి కవిత పట్టుకుని లాగింది కావేరి.

"వద్దొదినా... ఆకలిగా లేదు" కలత నిండిన కవిత స్వరం కావేరి మదిని కలచివేసింది.

"నీకు ఆకలిగా లేకపోవచ్చు. నువ్వలా అభోజనంగా వుంటే నాకు ముద్దెలా మింగుడుపడుతుంది చెప్పు. అందుకే నీకు ఆకలిగా లేకపోయినా నాకు కంపెనీ ఇవ్వడం కోసమైనా నాలుగు ముద్దలు తిను" టేబుల్ మీద కంచాలు పెట్టి వడ్డించింది కావేరి.

కవిత వెళ్లి చాలాసేపైనా ఆలోచనల నుంచి తేరుకోలేకపోయింది కావేరి.

ఆమెకు విస్మయం కలుగుతోంది. ధీరజ్ లో మూర్తీభవించిన ఆశయాలు, ఆదర్శాలు కార్యరూపం ధరించాయని సంబరపడింది ఆనాడు. కానీ, ఈనాడు... అవే ఆదర్శాలు 'నేతి ' బీరకాయలో 'నెయ్యి ' చందాన వుంటే మాత్రం తట్టుకోలేకపోతోంది.

ధీరజ్, కావేరి అన్నదమ్ముల పిల్లలు. అతడికి అక్కాచెల్లెళ్లు లేకపోవడం, ఆమే ఏకైక సంతానంగా పెరగడంతో ఇద్దరి నడుమ సోదర సోదరీ సంబధాన్ని మించిన స్నేహబంధమేదో అల్లుకుని బలపడింది.

చదువు పూర్తయ్యాక ఓ పెద్ద కంపెనీలో పోస్టింగ్ వచ్చిన తరువాత కవిత ధీరజ్ కు తారసపడింది.

కుందనపు బొమ్మలాంటి అందాల సుందరి కవిత. అంతకు మించిన అమాయకత్వం, సున్నితత్వం కలగలసిన కవితను తొలిచూపులోనే వలచాడు ధీరజ్. ఆమెను తనదాన్ని చేసుకోవాలని తపించాడు.

ధీరజ్ తల్లిదండ్రులు ఈ పెళ్లికి అభ్యంతరం లేవనెత్తారు. కారణం... కులాల అంతరమో, అంతస్తుల తారతమ్యమో కాదు.

పెళ్లైన రెండేళ్లకే కవిత భర్త ఏదో మాయరోగంతో కన్ను మూశాడు.

అతడికి ముందునుంచి వున్న రోగాన్ని దాచిపెట్టి, కవిత పుట్టింటివారిని మోసపుచ్చి ఈ పెళ్లి జరిపించారు కవిత అత్తామామలు. కానీ, వాళ్ల తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకుగానూ, కవిత క్యారెక్టర్ మంచిది కాదని, ఆ వాస్తవాన్ని తట్టుకోలేకే తమ బిడ్డ మంచానపడి మరణించాడని ఆమెపైనే అభియోగం మోపారు.

నిజానికన్నా అబద్ధానికి శక్తి ఎక్కువ.

గోరంత విషయం కొండంత రాద్ధాంతమై కవిత జీవితాన్ని కడగండ్లపాలు చేసింది. యవ్వనారంభంలో కవిత ఓ కుర్రాడిని ప్రేమించి (ప్రేమించానని భ్రమించి) ఆ వేడిలో అర్థం పర్థం లేని రాతలతో అతడికి నాలుగు ఉత్తరాలు రాయడం జరిగింది.

ఆ తరువాత అతడు అయోగ్యుడని తెలుసుకుని, అతడికి రాం రాం చెప్పేసి తల్లిదండ్రులు చూసిన ఈ సంబంధాన్ని చేసుకుంది.

ఈ సంగతి ఆ నోటా ఈ నోటా విన్న ఆమె అత్తగారు, దాన్నే హైలైట్ చేసి, పెళ్లైన తరువాత కూడా కవిత ఆ పాత ప్రియుడితో సంబధాన్ని కొనసాగించడంవల్లనే తమ బిడ్డ మనోవేదనకు గురై అకాలమరణం చెందాడని అసత్య ప్రచారాన్ని పారంభించారు.

తనమీద పడిన ఈ అపవాదును మోస్తూ ఎలా జీవించాలో, తన శీలానికి మచ్చలా దాపురించిన ఈ నిందని ఎలా తుడిచేసుకోవాలో తెలియని కవిత, తల్లడిల్లుతూ కాలం గడుపుతున్న సమయంలో ఆమెకు పరిచయమయ్యాడు ధీరజ్.

దిగజారిపోతున్న ఆమె ధైర్యాన్ని పైకిలాగి కొత్త ఉత్సాహాన్ని నింపాడు.

కానీ, విధవరాలు, పైగా కళంకం ఆపాదించబడిన యువతి అయిన కవితను చేపట్టేందుకు ధీరజ్ కన్నవారు అంగీకరించలేదు.

"మొగుడు చచ్చినదాన్ని పెళ్లిచేసుకుని ఉద్ధరించే ఖర్మ నీకేం పట్టిందిరా!" అంటూ నెత్తీనోరూ బాదుకున్నారు తల్లిదండ్రులు.

అయినా ధీరజ్ చలించలేదు. పటిన పట్టు నుంచి పక్కకు జరగలేదు. ఎన్ని అవాంతరాలెదురైనా కవితను చేపట్టే తీరుతానని ప్రతిన బూనాడు.

తను కవితను పెళ్లాడాలనుకుంటున్నది ఏ ఆదర్శాల కోసమో కాదని చెప్పాడు.

అపురూపమైన కవిత సౌందర్యం, నిష్కల్మషమైన ఆమె మనస్తత్వం తనకు నచ్చడం మూలానే ఆమెను వివాహమాడుతున్నానని స్పష్టం చేశాడు ధీరజ్.

అలాంటి సమయంలో కావేరి కలగజేసుకుని పెద్దవాళ్లకు నచ్చజెప్పింది.

"థాంక్స్ అక్కా... నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను" కృతజ్ఞతా పూర్వకంగా అన్నాడు ధీరజ్.

కథ సుఖాంతమైందని సంతోషించినంతసేపు పట్టలేదు. అంత 'ఉడుంపట్టు ' పట్టి కవితను కట్టుకున్న ధీరజ్ ఇలా మారడమే కావేరి

జీర్ణించుకోలేకపోతోంది.

"ఆయన నాకు విడాకులిస్తారట వదినా! నా క్యారెక్టర్ మంచిది కాదట... అసలు... అసలు నా కడుపులో వున్న బిడ్డకు ఆయన తండ్రి కానే కాదట!" పదే పదే కవిత దీనస్వరం మారుమోగుతోంది.

పెళ్లికి ముందో కవిత మీద అలాంటి ఆరోపణలు, అపవాదులు వున్నాయన్న సంగతి తెలిసినా, తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా ఆమెను తనదానిగా చేసుకున్న ధీరజ్ ఎంతో వివేకవంతుడని, ఆదర్శవంతుడని ఎంతగానో మురిసిపోయింది తను.

ధీరజ్ లోని విచక్షణ ఏమైంది?! ఎన్నో అవాంతరాలని, అభ్యంతరాలని అధిగమించి కవిత బతుకులో వసంతాలు పూయించిన ధీరజ్ లో ఈ మార్పేమిటి!

ఈ ప్రశ్న ఒక ప్రహేళికై కావేరి కంటిమీద కునుకు లేకుండా చేసింది.

"నేను విన్నది నిజమేనా ధీరజ్?" డొంక తిరుగుడు లేకుండా సూటిగా విషయాన్ని ప్రస్తావించదలచింది కావేరి.

"ఏం విన్నావక్కా?" తాపీగా అడిగాడు ధీరజ్.

"అదే... నువ్వు కవితకు విడాకులిచ్చేస్తానన్నావుట!"

ఆమె స్వరంలో కాఠిన్యానికి కాస్త తగ్గాడు ధీరజ్.

"కవిత... నన్ను చీట్ చేసిందక్కా..."

"కవిత అలాంటి అమ్మాయి కాదు" అనునయంగా అంది కావేరి.

"నిజమేనక్కా... తను మంచి అమ్మాయి అనే నేను భ్రమించాను, ఆరాధించాను. కానీ, సనకా అర్హత లేదని ఆలస్యంగా తెలుసుకున్నాను." ధీరజ్ స్వరం కంపించింది.

"ఏ నిర్ణయం తీసుకోవడంలోనైనా తొందరపాటు పనికిరాదు" నెమ్మదిగా అంది కవిత.

"నాది తొందరపాటు కాదక్కా... కవిత పాత ప్రేమికుడే ఆ విషయాన్ని నిర్ధారించాడు" ఆవేదనగా అన్నాడు ధీరజ్.

"నీతో పెళ్లి కావడానికి ముందు నుండీ కవిత ఎన్నో అపవాదులను మోస్తోంది. అప్పుడు వాటిని కేర్ చేయని నువ్వు... ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడం... ఆశ్చర్యంగా అనిపిస్తోంది" అంది కావేరి.

"నన్ను నమ్మి వచ్చిన అమ్మాయిని మధ్యలోనే విడిచిపెట్టేంత మూర్ఖుడిని కాదక్కా...! కానీ, వాడు చూపించిన సాక్ష్యాధారాలను బట్టి తను అనుమానించక తప్పలేదు. వాడు కవితతో మాట్లాడుతూండగా నేను కళ్లారా చూశాను కూడా" కణతలు రుద్దుకున్నాడు ధీరజ్.

"కవిత మీద కక్షకొద్దీ అతడు నకిలీ సాక్ష్యాలను సృష్టించి వుండొచ్చు కదా!" అంది కావేరి.

"నిజమే... ఫోటోలు, సి.డి.లు అంటే ఫేక్ అనుకుందాం. కానీ, బజార్లో వాళ్లిద్దరూ మాట్లాడుకోవడం మాటేమిటి? పైగా, కవిత ఆ విషయం నాతో చెప్పకుండా ఎందుకు దాచాలి?" అసహనంగా అన్నాడు ధీరజ్.

"అయినా... కేవలం అతడితో మాట్లాడినంత మాత్రానే కవితను నువ్వెలా అనుమానించగలవు? పెళ్లికి ముందే కవిత తన గురించిన ఏ విషయమూ దాచకుండా నీతో చెప్పింది కదా! అంత నిజాయితీగా వున్న కవిత నిన్ను మోసపుచ్చిందని నువ్వు బాధపడ్డం అవివేకం" నిలదీసింది కావేరి.

"ఈ సాక్ష్యాధారాలను చూపించి కవితను బ్లాక్ మెయిల్ చేస్తాడని నేననుకోను. అలా చేసేవాడే అయితే, పెళ్లికి ముందే చేసుండేవాడు

కదా! వాళ్ల మధ్య సంబంధం కంటిన్యూ అవుతోందనే నాకనిపిస్తోంది"నమ్మకంగా పలికాడు ధీరజ్.

"నిజంగా అతడు కవితను ప్రేమించిన మాట నిజమే అయితే ఆమె ఎక్కడ వున్నా ఆమె జీవితం హాయిగా సాగిపోవాలని ఆశిస్తాడు. పాలకుండలా వున్న ఆమె సంసారంలో విష బిందువులు చిలకరించాలనీ, ఆమె దాంపత్యంలో నిప్పులు పోయాలనీ అనుకోడు."

"అతడే గనక ఆమెను నిజంగా ప్రేమిస్తే, ఆమె భర్త మరణించిన వెంటనే ఆమెను చేపట్టి, తన ప్రేమ స్వచ్ఛమైనదని నిరూపించుకుని వుండేవాడు. కానీ, ఇలా నీతో సంసారబంధం ముడిపడిన తరువాత ప్రయత్నపూర్వకంగా ఆమె జీవితంలోకి చొరబడి ఆమె బతుకులో అల్లకల్లోలం రేపడానికి చూస్తున్నాడంటే వాడెంత దుర్మార్గుడో నువ్వర్థం చేసుకోవచ్చు. ఆమెతో మాట్లాడాడన్న ఒకేఒక్క కారణంతో కవితను అనుమానించి వేధిస్తున్నావంటే... నువ్వు నా తమ్ముడివి అనుకునేందుకే సిగ్గుగా వుంది" ఒక ప్రవాహ వేగంతో సాతిపోతున్న కావేరి మాటలు ధీరజ్ మెదడులో మూసుకుపోతున్న ఆలోచనా ద్వారాలను తెరచాయి.

నిజమే... తనింత లోతుగా, తార్కికంగా ఆలోచించలేకపోయాడెందుకు? అనుమానపు పొరలు కమ్మిన తన మనసు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయిందా!

"ఆదర్శమో, ఆకర్షణో కారణంఎదైనా కానీ... అమ్మానాన్నలను ఒప్పించి, కవితను తన అర్ధాంగిగా చేసుకున్నావు. ఇప్పుడు ఒక మోసగాడు, నయవంచకుడు అల్లిన మాయాజాలంలో చిక్కుకుపోయి, నిన్నే నమ్ముకున్న ఒక అమాయకురాలిని నడి సముద్రంలో నావలా విడిచిపెట్టాలనుకుంటున్నావు. దీన్నిబట్టి చూస్తే కవిత మీద నీకున్నది ప్రేమ కాదు... కోరికనిపిస్తోంది. ఆమె మీద వాంఛ తీరగానే... తొలినాటి మోజు తొలగిపోగానే... ఆమెలో లోపాలు వెదకి ఆమెను వదిలేయాలన్న దుర్మార్గపు ఆలోచన కలిగిందన్నమాట!"

"అక్కా ప్లీజ్... అలా అనకు. నేనిప్పటికీ కవితను ఆరాధిస్తూనే వున్నాను. కానీ..." ధీరజ్ మదిలోని ఘర్షణను ప్రతిబింబించిందతడి వదనం.

"అయితే, మరిలా ప్రవర్తిస్తున్నావేమిటి? తను నిర్దోషినని మొర పెట్టుకుంటున్నా వినిపించుకోనంత నిర్దయుడిగా ఎందుకు మారిపోయావు?" సూటిగా అడిగింది కావేరి.

ధీరజ్ మౌనంగా వుండిపోయాడు.

"పెళ్లికి ముందు ఏ కారణాలనైతే నువ్వు అల్పంగా భావించి, వాటిని పరిగణనలోకి తీసుకోక ఆమె మెడలో తాళి కట్టావో, అవే కారణాలను ఇప్పుడు మనసుకు పట్టించుకుని ఆమెకు విడాకులివ్వడానికి సైతం సిద్ధపడ్డావంటే... నీ నిబద్ధత ఏపాటిదో నాకు

బోధపడులతోంది. నా తమ్ముడు ఒక కుసంస్కారి అనుకోలేదు...." అతడి ముఖంలోకి చూడ్డం కూడా ఇష్టం లేనట్లుగా ముఖం తిప్పుకుంది కావేరి.

గుమ్మం దాకా వెళ్లిన ధీరజ్ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసి "నీ తమ్ముడు సంస్కారవంతుడో, కాదో నీకే తెలుస్తుంది" అనేసి గబగబా వీధిలోకి నడిచాడు.

అతడి మాటల్లోని భావం అర్థమైన కావేరి ముఖం ఆనందంతో వికసించింది, అతడి మదిలో మథనం మొదలైందని ఆమెకు అర్థమైంది.

మనసు తెరచి యోచిస్తే మంచి చెడుల లడుమగల అంతరం అతడికి అవగతమవుతుంది.

ఆ ఇంగితం అతడు తీసుకోబోతున్న అసంబద్ధమైన నిర్ణయాన్ని మారుస్తుంది. ఆ మార్పు కవిత జీవితాన్ని నిలబెడుతుంది. తృప్తిగా నిట్టూర్చింది కావేరి, ధీరజ్ వెళ్లినవైపే చూస్తూ...




ఎండ తీవ్రంగానే వుంది. ఎండకంటే ఉక్కపోత బాగా ఇబ్బంది పెడుతోంది. ట్రెజరీ ఆఫీసు ముందు రావిచెట్టు మీద కాకులు అరుస్తూ గోల పెడుతున్నాయి. కింద అరుగు మీద నలుగురైదుగురు ముసలమ్మలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

వృద్ధాప్య పింఛను కోసం ప్రతినెలా వస్తూనే వుంటారు. పెద్దవయసు, అయినా తప్పదు. ప్రతినెలా రావలసిందే! కానీ, గత నాలుగు నెలలుగా పింఛను రాలేదు. ఈ రోజున ఆ మొత్తం ఒక్కసారే ఇస్తారని చెప్పారు.

పొద్దుట వచ్చేటప్పుడు అన్నం తిని రావడం మంచిదయింది. లేకపోతే, ఈ మధ్యాహ్నం వేళకల్లా ఆకలితో గాబరా పడిపోయేవారు.

సెప్టెంబరు మాసం. ఒక్కోరోజు తిక్క ఎండ కాస్తుంది. ఉక్కపోతతో జనానికి పిచ్చెక్కి పోతుంది. సాయంత్రానికల్లా విపరీతమైన వర్షం కురుస్తుంది.

ఆ ముసలమ్మలు ట్రెజరీ ఆఫీసుకు రాగానే గుమాస్తా విజయబాబును కలిశారు. అతను విసుగ్గా "పొద్దున్నే వచ్చారా? మాకు వేరే పనులుండవా? గంటాగి రండి" అన్నాడు. వృద్ధులంతా నెమ్మదిగా రావిచెట్టు అరుగు మీదకు చేరి పిచ్చాపాటీతో కాలక్షేపం చేస్తున్నారు.

గంట తర్వాత మళ్లీ కలిస్తే, అందరి కాగితాలూ తీసుకుని, పరిశీలించి "ఒక గంట తర్వాత రండి" నిర్లక్ష్యంగా అంటూ కాగితాలు బల్ల మీద పడేశాడు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు అతి సధారణంగా ఉపయోగించే అద్భుతమైన చిట్కా అది.

"పండు రాలాలంటే బాగా పండాలి. పైస రాలాలంటే బాగా ఎండాలి." పనికోసం వచ్చినవాళ్లను ఏదో వంకన తిప్పుతో సాయంత్రం దాకా ఎండలో విసిగిస్తేనే డబ్బులు రాలుతాయి.

వారెన్ బఫెట్కు అవకాశం లేకగానీ, మన ట్రెజరీ గుమాస్తాల దగ్గర ట్రైనింగ్ తీసుకుని వుంటే మరిన్ని లాభాలు సునాయాసంగా గడించేవాడు.

డెబ్బై, ఎనభై ఏళ్ల ముసలివాళ్లను అట్లా ఎండలో తిప్పి, విసిగించి, చివరకు తలా యాభై నొక్కేసి, పెన్షను డబ్బులు ఇచ్చాడు విజయ్ బాబు. బాధపడ్డా, తిట్టుకున్నా తప్పనిసరై రాజీపడ్డారు అందరూ… లేకపోతే రేపు రండి, ఎల్లుండి రండి అని తిప్పి చంపుతాడు. ముందు ముందింకా వేధిస్తాడు.

ఆ రోజు సాయంకాలానికే ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకున్నాయి. చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఉధృతమైన వర్షానికి సూచనలు కనిపిస్తున్నాయి. బాగా ఉక్కపోస్తే వర్షం దంచికొడుతుందట.

చీకటి పడింది. ఉరుములు, మెరుపులతో ఆకాశం అలజడిగా వుంది. పెంకుటింటి అరుగు మీద మనవడిని ఒళ్లో కూర్చోపెట్టుకుని కబుర్లు చెభుతోంది రాజమ్మ. దూరంగా రోడ్డుమీద వాహనాలు వస్తూ పోతున్నాయి. వీధిలైట్ల వెలుగులో వర్షపు చినుకుల దారాలు కనిపిస్తున్నాయి.

ఇంట్లో కోడలు వంటపనిలో వుంటే కొడుకు టీవీతో కాలక్షేపం చేస్తున్నాడు.

రోడ్డుమీద ధడేలుమని శబ్దం వినిపించింది. ఉరుములా అంపించకపోయేసరికి ఉలిక్కిపడి చూసింది రాజమ్మ. పెద్ద వాహనం ఒకటి బైకును ఢీకొట్టి వెళ్లిపోయింది. బైకు, దానిపైనున్న వ్యక్తి అల్లంత దూరాన ఎగిరిపడ్డారు.

"బాబూ, లారీ బైకును గుద్దేసిందిరా" ఆతృతతో అరచింది రాజమ్మ. కొడుకు, కోడలు అరుగు మీదకు వచ్చి చూశారు. దూరంగా వీధిలైట్ల వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్నాడా వ్యక్తి. చలనం లేదు.

"ఎట్లరా కొడకా... పాపం, బతికిండో, చచ్చిండో"

"మనకెందుకమ్మా గొడవ. పోలీసు కేసైతే ఇబ్బంది" అన్నాడు కొడుకు.

"నిజమే" అన్నది కోడలు.

వర్షం దూకుడు కాస్త తగ్గుముఖం పట్టింది.

"గట్లనొద్దు కొడకా... ఏ తల్లి కన్న బిడ్డడో! మనకు చేతనైతే గింత సాయం చేద్దాం. గొడుగేస్కపోయి చూసిరా" అని బతిమాలి గొడుగు ఇచ్చి పంపింది.

కొడుకు చూసి వచ్చాడు. "పానంతోటే వున్నడు గని, ఉలుకూ పలుకూ లేదు. తలకు దెబ్బ తగిలినట్టున్నది. రక్తం బాగా కారుతున్నది" అన్నాడు.

రాజమ్మకు ఏడుపు తన్నుకొచ్చింది. కొడుక్కు నచ్చజెప్పి, పక్కిండి పోచయ్యను బతిమాలి, ఆ వ్యక్తిని అరుగు మీదకు చేర్పించింది. 108కి ఫోన్ చేస్తూంటే లైను దొరకడం లేదు.

తలనుండి రక్తం కారిపోతూంటే చారెడంత పసుపు అద్ది కట్టు కట్టింది రాజమ్మ.

రాజమ్మ చెంచాతో గోరువెచ్చటి పాలు నోట్లో పోస్తూంటే తడిగుడ్డతో రక్తం మరకలు తుడిచింది కోడలు.

కొడుకు ఎంత ప్రయత్నించినా ఫోన్లో 108 దొరకడం లేదు. చివరకు ఒక ప్రైవేటు అంబులేన్స్ కు ఫోన్ చేశాడు.

ఆ వ్యక్తికి పూర్తిగా స్పృహ లేకపోయినా, లీలగా తెలుస్తూనే వుంది. కళ్లు తెరవలేకపోతున్నాడు. అతని ప్యాంటు జేబులోంచి మనీపర్సు కిందకు జారింది. బరువైన ఆ పర్సుని కోడలు దిండు కింద దాచింది.

ఆ వ్యక్తి అది గ్రహించాడు. ఆ పర్సులో పదివేలున్నాయి. తన ప్రాణం కాపాడినవాళ్లకు అటువంటివి పదిచ్చినా ఋణం తీరదు అనుకున్నాడు.

అంబులేన్స్ వచ్చింది. ఆ వ్యక్తిని పరీక్షించి, వెంటనే గ్లూకోజ్ పెట్టారు. "అమ్మా నువ్వు సరైన సమయంలో పసుపుతో తలకు కట్టు కట్టావు. లేకపోతే, ఈపాటికి చనిపోయి వుండేవాడు. రక్తం బాగా పోయింది" అన్నాడు డాక్టరు.

ఆ తర్వాత ఆ ట్రెజరీ సెంటర్ లోని 50 మంది ముసలమ్మలకు తమ పింఛనుతోపాటు ప్రతినెలా వందరూపాయలు అదనంగా లభించసాగింది.

ఆ ఐదువేలూ పోను మిగతా జీతం అందుకున్న విజయ్ బాబు మనసులో మరోజన్మ పొందినంత ఆనందం.




విధేయ రాజ్యాన్ని పరిపాలించే గోవర్ధనవర్మ గొప్ప ధైర్య సాహసాలు కలిగినవాడు. ప్రజల్ని కంటిపాపలవలే చూసుకునేవాడు. ఆయన పరిపాలనలో అంతా సుఖ సంతోషాలతో ఉండేవారు.

ఆ మహారాజుకున్న ఒకే ఒక లోటు ఏమిటంటే, బుద్ధిమాంద్యపు పిల్లాడు పుట్టడం. ఏ శాపమో, ఏ జన్మలో చేసుకున్న పాపఫలితమో కాని తనకి జన్మించిన ఆ పిల్లాడిని చూసి రాజు చింతాక్రాంతుడవుతుండేవాడు.

ఒకనాటి సాయంకాలం మహారాజు మంత్రితో దేశ పరిస్థితులను గురించి చర్చిస్తున్నాడు.

అప్పుడు మంత్రి " మహారాజా, యువరాజావారిని పట్టాభిషిక్తుణ్ణి చేసే సమయం ఆసన్నమైంది. మీరు ఈ విషయంలో కాస్త ఆలోచించాలి. " అన్నాడు.

" మా అబ్బాయి సంగతి తెలుసు కదా ! రాజంటే శత్రువుల గుండెల్లో పదునైన కత్తిలా, ప్రజల మనసుల్లో కమ్మటి వెన్నలా వుండాలి. బుద్ధి మాంద్యంతో పుట్టిన మా అబ్బాయి శాస్త్ర,శస్త్ర విద్యలు అభ్యసించ లేదు సరి కదా, కనీసం మామూలుగా ఆలోచించడం కూడా రాదాయె. పుత్ర వాత్సల్యంతో నేను వాడికి పట్టాభిషేకం చేస్తే ఆలోచనలేని మహారాజు కింద పని చేసే వారందరూ ఆ లోటుని ఎవరికనుకూలంగా వారు మార్చుకునే ప్రమాదం లేకపోలేదు. తద్వారా రాజ్యంలో తలెత్తే అరాచకం ఏపాటిదో ఊహించడానికే మనసొప్పడం లేదు. " అన్నాడు విచలిత మనస్కుడై.

" అయ్యా క్షమించాలి. ఈ చల్లటి సాయం సంధ్య వేళ హాయిగా సేద దీరుతున్న మీ మనసుని పాడు చేసాను. పోనీ యువరాజు గారిని పట్టాభిషిక్తుడిని చేద్దాం. పరిపాలన చేయడానికి మరో యోగ్యుడిని నియమిద్దాం.మనం పైనుండి పర్యవేక్షిద్దాం. ఏమంటారు. ? " అన్నాడు.

" మంత్రిగారూ, వన్శపారంపర్యంగా నేనూ మా వాళ్ళే ఈ రాజ్యాన్ని పరిపాలించాలనే ఉద్దేశం నాకు లేదు. రాజ్యం వీరభోజ్యం. అందుచేత రాజ్యాధికారానికి కావాల్సిన అర్హతలున్న అభ్యర్థిని మీరు వెతకండి. "అన్నాడు.

రెండు సంవత్సరాల కాలం గిర్రున తిరిగింది.

ఆరోజు రాజ్యంలో మహోన్నత కార్యక్రమం జరుగుతోంది అది.. విక్రముడనే యువకుడిని మహారాజుగారు దత్తత తీసుకుని ఆ తర్వాత పట్టాభిషేకం చేయనున్నారు.

కొన్నాళ్ళ తర్వాత సాయంకాలం మహారాజు, మంత్రి మాట్లాడుకుంటున్నారు.

" విక్రముడి పాలన్ భేషుగ్గా వుందని ప్రజలు జేజేలు పలుకుతున్నారు ప్రభూ. శత్రువులు మన రాజ్యం వైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడుతున్నారు. మీ నిర్ణయం సర్వామోదమైంది " అన్నాడు మంత్రి సంతోషంగా.

" మహారాజుకి పరిపాలనలో మేటి అనిపించుకోవాలన్న స్వార్థం తప్ప మరేదీ పనికిరాదు. ముఖ్యంగా కుటుంబ, ఆశ్రిత పక్షపాతాలు అస్సలు పనికిరాదు. అనుక్షణం రాజ్యశాంతియే పరమావధిగా ఉండాలి. మీరు చెప్పినది విన్న తరువాత నా మనస్సు పరిపూర్ణ శాంతినొందింది.."